నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక 56 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | ఆగస్టు 24, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


### నీలగిరి నిత్యపద్యం

ఆటవలది

బరువు మోయలేక వర్షించు మేఘమ్ము
బాధ పెరుగ గాను బాష్పములును
పంచుకొనగ తగ్గు భారంబు,బాధలు
విజయలక్ష్మి వాక్కు వినర నరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


విలేకరులు కావలెను

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

పూర్తి వివరాలకు

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.


# తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రచారం చేయండి

**● లండన్‌లో తెలుగు ప్రవాసులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు**




**హైదరాబాద్, ఆగస్టు 23:** తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయాలని లండన్‌లోని తెలుగు ప్రవాసులకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆదివారం లండన్‌లోని తెలుగు ప్రవాసులతో సమావేశమయ్యారు. తెలంగాణ అభివృద్ధి, భవిష్యత్ ప్రగతిపై ఈ సందర్భంగా వారితో చర్చించారు. తెలంగాణ అభివృద్ధిలో ప్రవాసులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రచారం చేస్తూ, రాష్ట్రానికి రాయబారులుగా నిలవాలని కోరారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు హాజరుకావాలని కోరారు. పెట్టుబడుల కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నామన్నారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రవా సాంధ్రులు సహకారాన్ని అందించాలని కోరారు.అన్ని విషయాలపై మాట్లాడుతా కేంద్ర విదేశీ వ్యవహారాల

మిగతా2లో...

## కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్

# సమరభేరి



**- సెప్టెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్త నిరసనలు**
**- బాకీ కార్డు పేరుతో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**
**- పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు**

**హైదరాబాద్, ఆగస్టు 23:** వంద రోజుల్లోనే ఆరుగ్యారంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులైనా అమలు చేయకుండా ప్రజలను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్ సమరభేరి మోగించ నుంది. కాంగ్రెస్ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు కార్యాచరణను సిద్ధం చేసింది. వచ్చేనెల రెండు నుంచి వారంరోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ సీనియర్ నాయకులు,

మిగతా2లో...




# లిక్కర్ రవాణా కేసు..

**ఎపి మాజీ మంత్రి కారుమూరి అరెస్టు**

**హైదరాబాద్, ఆగస్టు 23:** వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి వైసిపి నేత కారుమూరి నాగేశ్వరరావు అరెస్ట్ అయ్యారు. ఇడి అధికారులు ఆయన్ను అరెస్ట్ చేశారు.

మిగతా2లో...

## మళ్లీ దేశవ్యాప్త

# ఆందోళనకు సిద్ధం

**కేంద్రం ఇచ్చిన హామీల అమలుపై నేడు సమీక్ష**

**ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ, పరిహారం అంశాల్లో పురోగతి లేదు : సీజేపీ**




**ముంబయి ఆగస్టు 23:** కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై అసంతృప్తి వ్యక్తం చేసిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)మరోసారి ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధమవుతోంది. జులై 25న దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనను విరమించినప్పటికీ... కేంద్రం నుంచి హామీల అమలుపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి

మిగతా2లో...

## జమిలికి ఎన్డీఏ

# కసరత్తు!

**● కూటమి అధికారంలో ఉన్న 22 రాష్ట్రాలు, యూటీల్లో అసెంబ్లీలు ముందుగానే రద్దు ● ప్రణాళికలు రచిస్తోన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ● ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత ● రాజకీయ వర్గాల్లో మరోసారి తీవ్ర చర్చ ● ఈ ఏడాది శీతాకాల సమావేశాల్లో నివేదిక సమర్పించే అవకాశం ● 2029లోనే 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్'కు సమాలోచనలు**




## ఆటో కార్మికుల సమస్యలు

# పరిష్కరిస్తాం

**- సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తున్నాం : మంత్రి పొన్నం**




## నాసిరకం యూనిఫారాలపై

# విచారణ జరపాలి

**- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్**



**హైదరాబాద్, ఆగస్టు 23:** నాసిరకం యూనిఫారాల పంపిణీపై విచారణ జరపాలని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాట్లాడితే ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థ అనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీసం నాణ్యమైన యూనిఫారాలు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారా?అని ప్రశ్నించారు. విద్యార్థులకు నాసిరకం యూనిఫారాల పంపిణీపై హరీశ్‌రావు ఆదివారం ఎక్స్ ద్వారా స్పందించారు. ఇదేనా అంతర్జాతీయ ప్రమాణాలు రేవంత్ రెడ్డి?అని అడిగారు. ఒకచోట యూనిఫారాలు అందలేదనీ, అందినచోట కొలతలు సరిగ్గా లేవనీ, కుట్లు ఊడిపోతున్నా యని తెలిపారు. ఉతికితే రంగులు వెలిసిపోతున్నాయనీ, రెండు జతలు ఇవ్వాల్సి ఉండగా, చాలా చోట్ల ఒక్క జత కూడా పూర్తిగా అందలేదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి గుజరాత్ దళారులపై ఉన్న ప్రేమ తెలంగాణ చేనేత కార్మికులపై లేదని తెలిపారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేలా స్థానికంగా యూనిఫారాల తయారీకి ప్రాధాన్యత ఇవ్వాల్సింది పోయి కమీషన్ల కోసం

మిగతా2లో...

## తెలంగాణలో మూడు రోజులపాటు

# భారీ వర్షాలు..







# దక్షిణాదికి ధరల దడ

**నిత్యం పెరుగుతున్న బియ్యం, పాలు, చక్కెర, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధరలు**

**గత రెండేండ్లలో భారీగా పెరుగుదల**

**సామాన్యుడి జేబుకు భారీ చిల్లు**

RNI - TELTEL/2023/87644

నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక



# కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కమిటీతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టేలా కార్యాచరణను విజయవంతం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలేవీ సంపూర్ణంగా నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. వెయ్యి రోజులు పూర్తయినా హామీలను సంపూర్ణంగా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు.

ప్రభుత్వ పరిపాలనా వైఫల్యం, అవినీతి, అరాచకాల పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా ప్రజలను మోసం చేసిందో ప్రతి వర్గానికి అర్థమయ్యేలా వివరించేందుకు వచ్చేనెల రెండు నుంచి భారీ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమాలు కేవలం హామీల చుట్టూ కాకుండా ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక చోటుచేసుకున్న వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రధానంగా ప్రస్తావించాలని సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల బకాయిలను మరోసారి 'బాకీ కార్డుల' రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. రైతు కూలీలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, యువతకు ప్రతి నెలా ఇస్తామన్న ఆర్థిక సహాయం ఎంత మేరకు పేరుకు పోయిందో ఈ బాకీ కార్డుల ద్వారా ప్రజలకు గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల మాజీ చైర్మెన్లు, జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్లు సహా అన్ని స్థాయిల నాయకులు పాల్గొనాలని కోరారు. నిరసన కార్యక్రమాలను వినూత్నంగా నిర్వహించాలని సూచించారు.

# మళ్లీ దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం అందలేదని పార్టీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో సోమవారం జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నట్టు వెల్లడించింది. జులై 25న ఆందోళన విరమించే సమయంలో కేంద్రం తమకు పలు హామీలు ఇచ్చిందని సీజేపీ తెలిపింది. వాటి అమలు విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అధికారికంగా తమకు తెలియజేయలేదని పేర్కొంది. ప్రభుత్వం ఇచ్చిన మాటను నమ్మి ఉద్యమాన్ని విరమించామనీ, తమ విశ్వాసాన్ని బలహీనతగా భావించొద్దని సీజేపీ హెచ్చరించింది. హామీల అమలుకు అవసరమైన అన్ని చర్యలనూ పరిశీలిస్తామనీ, అందులో మరోసారి శాంతియుత మరోసారి శాంతియుత దేశవ్యాప్త ఆందోళన చేపట్టే అవకాశమూ ఉందని స్పష్టం చేసింది. కేంద్రం ఇచ్చిన హామీలను ఆలస్యం చేయడం, వేరే అర్థం చెప్పడం లేదా విస్మరించడం వంటి చర్యలను సహించబోమని హెచ్చరించింది. అలా జరిగితే దేశ యువతకు చేసిన వాగ్దానానికి ద్రోహంగా భావిస్తామని స్పష్టం చేసింది.

**ఎఫ్ఐఆర్‌లపై సుప్రీంకోర్టులో విచారణ** ఇటీవల ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం కూడా కీలకంగా మారింది. ఆగస్టు 18న దేశవ్యాప్తంగా విద్యార్థులు, ఆందోళనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల సమగ్ర జాబితాను సమర్పించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరినట్టు సీజేపీ తెలిపింది. సుప్రీంకోర్టు ఈ జాబితాను మూడుసార్లు కోరిందనీ, కేసులను కొట్టివేసేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అధికారాలను వినియోగించే అంశాన్ని పరిశీలించేందుకు ఈ వివరాలు అవసరమని వివరించింది. అయితే కోర్టు పదేపదే కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ జాబితాను అందజేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వలేదని ఆరోపించింది.

**'యువతను మోసం చేస్తున్నారా?'** సుప్రీంకోర్టు విచారణ అనంతరం సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్, న్యాయ వ్యవహారాల విభాగం బాధ్యురాలు రత్నా సింగ్ ప్రభుత్వ వైఖరిపై ఆందోళన వ్యక్తం చేసినట్టు పార్టీ తెలిపింది. కేంద్రంతో చర్చల సందర్భంగా ఇచ్చిన హామీల ఆధారంగానే ఉద్యమాన్ని విరమించామని, ఇప్పుడు వాటి అమలులో జాప్యం జరుగుతుండటం యువతను మోసం చేసినట్లేనని వారు అభిప్రాయపడినట్టు పేర్కొంది. ముఖ్యంగా నిరసనలకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించడం, విద్యార్థులు లేదా శాంతియుత ఆందోళనకారులపై భవిష్యత్తులో శిక్షాత్మక చర్యలు తీసుకోకుండా హామీ ఇవ్వడం వంటి అంశాలపై స్పష్టత కావాలని సీజేపీ కోరుతోంది.

**నీట్ బాధిత కుటుంబాలకు పరిహారం** సీజేపీ డిమాండ్లలో మరో కీలక అంశం నీట్ యూజీ వివాదం. పేపర్ లీక్ కారణంగా మేలో పరీక్ష రద్దు కావడం, దాని తర్వాత కొందరు అభ్యర్థులు ఆత్మహత్యలకు పాల్పడిన నేపథ్యంలో మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని పార్టీ డిమాండ్ చేసింది. ఈ అంశంపైనా కేంద్రం హామీ ఇచ్చిందని చెప్తోంది. అయితే పరిహారం, ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ సహా లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం తమను అధికారికంగా సంప్రదించలేదని ఆరోపించింది. ఇక ఇటీవల నిరసనల సందర్భంగా పోలీసుల చర్యపై విచారణ జరిపేందుకు హైపవర్డ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ రోజు జరిగిన మార్చ్ ఫుటేజీని కమిటీ పరిశీలిస్తుందని తెలిపింది. అలాగే మహిళా ఆందోళనకారుల్ని లక్ష్యంగా చేసుకున్నారంటూ వచ్చిన ఆరోపణలపై కూడా దర్యాప్తు జరుగుతుందని వెల్లడించింది. ఈ ప్యానెల్‌లో మాజీ న్యాయమూర్తులు, సీబీఐ మాజీ డైరెక్టర్, రాష్ట్ర మాజీ డీజీపీ సభ్యులుగా ఉంటారని చెప్పింది.

# జమిలికి ఎన్డీఏ కసరత్తు!

**న్యూఢిల్లీ:ఆగస్టు 23:** 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' (ఒకే దేశం.. ఒకే ఎన్నిక)ను 2034 నుంచి అమలు చేయాలన్న ప్రస్తుత ప్రతిపాదనను కాస్త ముందుకు జరిపి 2029కి తీసుకురావడంపై బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏలో చర్చలు జరుగుతున్నట్టు సమాచారం. ఇందుకోసం ఎన్డీఏ పాలనలో ఉన్న 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతా(యూటీ)ల అసెంబ్లీలను వాటి పూర్తి పదవీకాలం ముగియకముందే రద్దు చేసి, 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు ఎన్నికలు నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే పలు రాష్ట్రాల ప్రభుత్వాల పదవీకాలం గణనీయంగా కుదించాల్సి ఉంటుంది.

మరికొన్ని రాష్ట్రాలు మాత్రం లోక్‌సభ ఎన్నికలతోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అయితే జమిలి ఎన్నికలను ఆది నుంచీ వ్యతిరేకిస్తున్న ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఎన్డీఏ ప్రయత్నాలకు సహకరించే పరిస్థితులు మాత్రం కనబడటం లేవు. దీంతో 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్'పై రాజకీయ వర్గాల్లో మరోసారి తీవ్ర చర్చ నడుస్తోంది. ప్రస్తుతం జమిలి ఎన్నికలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వివిధ వర్గాలతో సంప్రదింపులు జరుపుతోంది. రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రజాప్రతినిధులు, న్యాయ నిపుణులు, విద్యావేత్తలు, పారిశ్రామిక వర్గాలతో కమిటీ చర్చలు కొనసాగిస్తోంది. ఈ కమిటీ ఈ ఏడాది శీతాకాల సమావేశాల్లో తన నివేదికను సమర్పించే అవకాశం ఉంది.

**22 రాష్ట్రాలపై దృష్టి** ఎన్డీఏ పాలనలో ఉన్న 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 11 చోట్ల 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు వచ్చే రెండేండ్లలో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. మరో నాలుగు రాష్ట్రాలు ఇప్పటికే లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించుకునే షెడ్యూల్‌లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, ఒడిశా రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ నాలుగు రాష్ట్రాల్లోనూ ఎన్డీఏ పాలనలో ఉంది. మిగిలిన రాష్ట్రాల అసెంబ్లీలను కూడా 2029 నాటికి ఒకే ఎన్నికల చక్రంలోకి తీసుకు రావడమే తాజా ఆలోచనగా తెలుస్తోంది.

# దక్షిణాదికి ధరల దడ

**న్యూఢిల్లీ : ఆగస్టు 23:** నిత్యావసర సరుకుల ధరలు దక్షిణాది రాష్ట్రాల్లో భారీగా పెరుగుతుండటం సంచలనంగా మారింది. గత రెండేండ్లలో బియ్యం, పాలు, చక్కెర, ధనియాలు, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. ఉప్పు ధర మాత్రం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంది. వినియోగదారుల వ్యవహారాల శాఖకు చెందిన ధరల పర్యవేక్షణ విభాగం డాటాను విశ్లేషించి సౌత్ ఫస్ట్ నివేదిక విడుదల చేసింది. తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనే ఈ ధరల ప్రభావం ఎక్కువగా ఉన్నట్టు నివేదిక చెప్పింది. కేరళలో ప్రతి ఏడాది సరిపోయే డాటా లేకపోవడంతో ఆ రాష్ట్రాన్ని కొన్నింటికే పరిమితం చేస్తున్నట్టు సౌత్‌ఫస్ట్ తెలిపింది.

**సన్‌ఫ్లవర్ నూనె ధరల్లో భారీ పెరుగుదల..** సన్‌ఫ్లవర్ నూనె ధరలు అంచనాలకు మించి పెరిగిపోయాయి. 2024 నుంచి 2026 వరకు పరిశీలిస్తే ఒక్కో రాష్ట్రంలో తేడా గణనీయంగా పెరిగింది. తెలంగాణలో కిలో నూనె రూ.110 నుంచి రూ.192కి, కర్ణాటకలో రూ.114.38 నుంచి రూ.192.25కి, తమిళనాడులో రూ.115.71 నుంచి రూ.19 3.58కి, ఏపీలో రూ.115.50 నుంచి రూ.18 8.67కి పెరిగింది.

**చేదెక్కిన చక్కెర..** సౌత్‌ఫస్ట్ నివేదిక ప్రకారం చక్కెర ధరల్లోనూ గణనీయంగా పెరుగుదల కనిపించింది. కర్ణాటకలో కిలో చక్కెర రూ.43 నుంచి రూ.53.34కి, తమిళనాడులో రూ.44.28 నుంచి రూ.53.58కి, ఏపీలో రూ.43.50 నుంచి రూ.49కి, తెలంగాణలో రూ.40.50 నుంచి రూ.45కి పెరిగింది.

**అన్ని రాష్ట్రాల్లో పెరిగిన పాల ధరలు..** పాల ధరలు నాలుగు రాష్ట్రాల్లోనూ గణనీయంగా పెరిగాయి. లీటరు పాల ధర కర్ణాటకలో రూ.43.50 నుంచి రూ.51.97కి, తెలంగాణలో రూ.57.20 నుంచి రూ.67.64, ఏపీలో రూ.56 నుంచి రూ.60.52కి, తమిళనాడు రూ.41.67 నుంచి రూ.44.53కి పెరిగింది.

**బియ్యం ధరల్లో భారీ మార్పులు** బియ్యం ధరలు కూడా సామాన్యులకు షాక్ ఇస్తున్నాయి. తెలంగాణలా కిలో బియ్యం ధర రూ.41.80 నుంచి రూ.57.64కి పెరిగింది. కర్ణాటకలో రూ.48.25 నుంచి రూ.61.72కి, తమిళనాడులో రూ.48.44 నుంచి రూ.60.25కి, ఏపీలో రూ.51 నుంచి రూ.55.44కి పెరిగింది.పెరిగినవి ఎక్కువ..

**తగ్గినవి తక్కువ** 2024 నుంచి 2026 వరకు కందిపప్పు, ఎర్ర మిరపకాయలు, పసుపు రేట్లు కొద్ది మేర తగ్గాయి. ఉప్పు మాత్రం రాష్ట్రాన్ని బట్టి పెరగడం, తగ్గడం జరిగింది. పంటల ఉత్పత్తి, సాగు విస్తీర్ణం, నిల్వలు, సేకరణ, దేశీయ, అంతర్జాతీయ ధరలు ఈ నాలుగు రాష్ట్రాల్లో వంటింటి సరుకుల ధరలపై ప్రభా వం




చూపించాయని సౌత్‌ఫస్ట్ వెల్లడించింది.

**తెలంగాణలో పెరుగుతున్న ఉల్లి ధరలు.. మహారాష్ట్ర నుంచి తగ్గిన సరఫరా** తెలంగాణలో ఉల్లి ధరలు ఒక్కసారిగా రెట్టింపు అయ్యాయి. మొన్నటి వరకు రూ.20- రూ.30 ఉన్న కిలో ఉల్లి ధర ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో రూ.40 నుంచి రూ.50 వరకు పలుకుతుండగా, కొన్ని ప్రాంతాల్లో రూ.60 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు. నగరంలోని మలక్‌పేట్ మార్కెట్‌లో క్వింటాల్ గతంలో రూ.2,500- రూ. 3,000 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.4,500-రూ.5,000కు చేరింది. మహారాష్ట్ర , కర్నూల్, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి తెలంగాణకు ఉల్లి సరఫరా తగ్గిందని వ్యాపారులు పేర్కొన్నారు.దీంతో పాటు ఖరీఫ్‌లో ఎల్ నినో ప్రభావం, వర్షాకాలంలో పంట సాగు ఆలస్యం కావడం వల్ల అన్ని ప్రాంతాల్లో దిగుబడి తగ్గింది. దీంతో మార్కెట్‌కు సరుకు రాక తగ్గిపోవడంతో డిమాండ్ పెరిగి ధరలపై తీవ్ర ప్రభావం పడింది. ఉల్లి ధరలు పెరుగుతుండటంపై వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసరమైన ఉల్లిని కిలోకు రూ.60, రూ.70 చెల్లించి కొనుగోలు చేయడం భారంగా మారిందని వాపోతున్నారు. ఉల్లి ధరలు పెరగడంతో హోటళ్ళు, రెస్టారెంట్లపై కూడా ప్రభావం పడుతున్నది. వంటల తయారీలో ఉల్లి వినియోగం ఎక్కువగా ఉండటంతో.. రెస్టారెంట్లలో ఉల్లిపాయకు ప్రత్యేక ధరలు వసూలు చేస్తున్నారు.

# తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రచారం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రిత్వ శాఖ ఆయనను అమెరికా వెళ్లకుండా అడ్డుకుందని, రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. దీనికి సంబంధించిన అన్ని విషయాలనూ ఆయన హైదరాబాద్ వచ్చాక మాట్లాడుతానని తెలిపారు.ఆదివారం ఎక్స్ వేదికగా స్పందించారు. అనుమతి నిరాకరణ నేపథ్యంలో ఆయనకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు, పార్టీ నాయకులకు, ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. షెడ్యూల్ ప్రకారం లండన్‌లో తన సమావేశాలు ముగిశాయని వెల్లడించారు. మూడు రోజుల పర్యటనలో అద్భుతమైన మద్దతు లభించిందని రేవంత్ రెడ్డి తెలిపారు. షెడ్యూల్ ప్రకారం లండన్ నుంచి బోస్టన్ వెళ్లాల్సి ఉందనీ, అయితే కేంద్రం నిరాకరించడంతో తిరిగి హైదరాబాద్ కు బయలుదేరుతున్నట్టు వివరించారు.

# లిక్కర్ రవాణా కేసు..

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఇడి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం రవాణా టెండర్లలో అక్రమాలు, నగదు లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్టు అయ్యారు.

అరెస్టు అయిన వారిలో కారుమూరి నాగేశ్వర రావు కుమారుడు సునీల్ కుమార్, ఎపి బేవరేజెస్ మాజీ ఎంపి వాసుదేవ రెడ్డి, రాజ్‌కెసి రెడ్డి ఉన్నారు. లిక్కర్ రవాణా టెండర్లలో సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్‌ను ఫ్రంట్ కంపెనీగా ఉపయోగించినట్లు ఇడి అనుమానిస్తోంది. ఈ కేసులో హవాలా లావాదేవీలపై కూడా దర్యాప్తు ముమ్మరం చేసింది.

# ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

**హైదరాబాద్, ఆగస్టు 23:** ఆటో కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామనీ, వారు తమ సమ్మెను వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డీజిల్,పెట్రోల్ ఆటోలను రెటిరోఫిట్మెంట్ చేసుకోవడా నికి రూ.1.50 లక్షలు ఆర్థిక సహాయం చేయడానికి కొత్త పథకం తీసుకొస్తున్నామని తెలిపారు. 2015 తర్వాత ఆటో చార్జీలను పెంచలేదనీ, పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు, వాహనాల ధరలు, నిర్వహణ ఖర్చులను పరిగణనలోకి తీసుకుని ఆటో చార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు.ఆ కమిటీలో ఆటో కార్మికుల ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, సంబంధిత వర్గాలను భాగస్వామ్యం చేసి, అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించి న్యాయమైన నిర్ణయం తీసుకుంటామని భరోసానిచ్చారు. ఇప్పటికే క్యాబినెట్‌లో ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని తీసుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఆటో కార్మికులపై ఆర్థిక భారం తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చే రెట్రోఫిట్మెంట్‌కు రూ.1.50 సహాయం అందించాలని నిర్ణయం జరిగిందని వివరించారు. పాత ఆటోలను స్క్రాప్ చేసి కొత్త ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేసుకునే వారికి కూడా ప్రభుత్వం సహకరిస్తుందని హామీనిచ్చారు.హైదరాబాద్‌లో దశలవారీగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆటో కార్మికుల సమస్యలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని హామీనిచ్చారు.

# నాసిరకం యూనిఫారాలపై విచారణ జరపాలి

(మొదటి పేజీ తరువాయి)

బడా కార్పొరేట్ల నుంచి నాసిరకం యూనిఫారాలు తెప్పించి విద్యార్థులకు, చేనేత కార్మికులకు అన్యాయం చేశారని విమర్శించారు. "మఫత్‌లాల్ ముద్దు.. చేనేత వద్దు" అన్నదే ప్రభుత్వ వైఖరిగా మారిందా?అని ప్రశ్నించారు. చేనేత కార్మికుల ఉపాధికి గండి విద్యార్థులకు నాసిరకం యూనిఫారాలు అని తెలిపారు.

# తెలంగాణలో మూడు రోజులపాటు భారీ వర్షాలు..

**హైదరాబాద్: ఆగస్టు 23:**వాయవ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీనికి అనుబంధంగా సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, ఎత్తుకు వెళ్లేకొద్దీ ఇది నైరుతి దిశగా వంగి ఉందని అధికారులు తెలిపారు. అలాగే రుతుపవన ద్రోణి కూడా వాయవ్య బంగాళాఖాతంలోని అల్పపీడన ప్రాంతం మీదుగా కొనసాగుతుండటంతో రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరిగింది.ఈ నేపథ్యంలో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉండటంతో కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు వాతావరణ శాఖ 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. వీటితో పాటు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో 'ఎల్లో అలర్ట్' ప్రకటించారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలో రాగల 48 గంటల పాటు ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుందని, నగరంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముంది. గరిష్ఠ ఉష్ణోగ్రత 30 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 22 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉంది. రాబోయే వారంలోనూ రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కొనసాగుతాయని, ఆగస్టు 24, 25 తేదీల్లో కొన్ని ప్రాంతాల్లోనూ, ఆగస్టు 26 నుంచి 29 వరకు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# ఖర్గే చెంతకు కొండా పంచాయతీ

- సిఎం రేవంత్‌రెడ్డిపై సురేఖ కుమార్తె వ్యాఖ్యలను తప్పుపట్టిన ఖర్గే

**ఈ విషయంలో తాను ఏమీ చేయలేనని చెప్పినట్లు సమాచారం**



**హైదరాబాద్, ఆగస్టు 23:**రాష్ట్రంలో కొండా కుటుంబానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మధ్య నడుస్తున్న రాజకీయ వివాదంలో భాగంగా ఆదివారం మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేతో ఆదివారం బెంగుళూరులో భేటీ అయ్యారు. తాజా పరిణామాలపై ఆమె మల్లిఖార్జున ఖర్గేకు వివరణ ఇచ్చారు. దాదాపు అరగంటకుపైగా సాగిన సమావేశంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత వ్యాఖ్యల వివాదంపై ఖర్గెకు వివరించారు. సిఎం రేవంత్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై మల్లిఖార్జున ఖర్గే తప్పుపట్టినట్లు తెలిసింది.సమాచారం. తనకు ఇచ్చిన నోటీసుకు వివరణ ఇచ్చినప్పటికీ అందరూ తనను ఏకాకిని చేసి దాడిచేస్తున్నట్లు మంత్రి వాపోయినట్లు తెలిసింది. కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమని సురేఖ చెప్పినప్పటికీ, కమిటీ దానితో ఏకీభవించలేదని వివరణ ఇచ్చినట్ల సమాచారం. అయితే, ఈ వ్యవహారం తన వద్దకు రాలేదని, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చర్యల తర్వాత చూద్దామని కొండా సురేఖకు మల్లిఖార్జున ఖర్గే చెప్పినట్లు తెలిసింది.

# నీటి సరఫరా పునరుద్ధరించాలని రైతు కూలీ సంఘం డిమాండ్



**ఖానాపూర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ మండలంలోని గోసంపల్లి గ్రామంలో మిషన్ భగీరథ మంచినీళ్లు గత వారం రోజులుగా అందకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఆర్. ఉపాలి మాట్లాడుతూ, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఎంపీడీవో అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. గ్రామంలో రోడ్ల ఇరువైపులా ముండ్ల పొదలు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు, పాములు, తేళ్లు విస్తరిస్తున్నాయని, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పరిశుభ్రత చర్యలు చేపట్టి, గడ్డి మందు కొట్టి, చెత్తాచెదారం తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి వద్ద లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## ప్రమాదకర మలుపులకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



**ఖానాపూర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వాల్గోట్ కిషన్ రోడ్డు ప్రమాదాల నివారణకు ముందుకొచ్చారు. ఖానాపూర్--బెల్లాల్ రోడ్‌లోని పెద్దయ్యగుట్ట వద్ద ప్రమాదకర మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన స్వయంగా "ప్రమాదకర మలుపు -- నెమ్మదిగా వెళ్ళండి" అని రేడియం అక్షరాలతో రెండు బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రయాణీకులు మాట్లాడుతూ, ఉపాధ్యాయుడు చేసిన ఈ చిన్న ప్రయత్నం ప్రమాదాలు తగ్గించడంలో ఎంతో ఉపయోగకరంగా ఉందని అభిప్రాయపడ్డారు.

# గుండె రోగులకు మెరుగైన వైద్యం.. కార్డియాక్ సెంటర్ ప్రారంభం



**ఖానాపూర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నిర్మల్ జిల్లా ప్రజలకు అత్యాధునిక గుండె వైద్య సేవలు అందించేందుకు దేవేందర్ రెడ్డి సూపర్ స్పెషాలిటీ--డా. జగన్నాథం కార్డియాక్ సెంటర్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై, డా. దేవేందర్ రెడ్డి, డా. జగన్నాథం మరియు వారి వైద్య బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. జాన్సన్ నాయక్ మాట్లాడుతూ, జిల్లా ప్రజలకు స్థానికంగానే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన గుండె వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ సెంటర్ ద్వారా గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి మెరుగైన చికిత్స లభిస్తుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, సాయిబాబా ఆలయ అధ్యక్షుడు కొక్కుల ప్రదీప్, మాజీ వైస్ ఎంపీపీ వాల్ సింగ్, తోట సుమిత్, గోపాల్, మాజీ ఎంపీటీసీ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు




**అమ్రాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఈద్ మీలాదున్నబి సందర్భంగా అమ్రాబాద్ మండల కేంద్రంలోని సిపిఎస్ పాఠశాల ప్రాంగణంలో మైనారిటీ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రవక్త మహ మ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి జన్మది నాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అమ్రాబాద్ ఎస్ఐ హన్మంత్ రెడ్డి ప్రారంభించి, రక్తదానం చేసిన యువతను అభినందించారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, యువత సేవా కార్యక్రమాల్లో మరింతగా భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జామా మసీదు సదర్ అబ్బాస్ అలీ, సిపిఎస్ హెడ్ మాస్టర్ లాలయ్య, మైనారిటీ నాయకులు గులాం దస్తగిర్, ఇక్బాల్, షేరాఫ్, ఇస్మాయిల్, అక్రమ్, ఖదీర్, అతహర్, కశీమ్ తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ రికార్డు కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన అమికబుల్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు



**అమ్రాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హైదరాబాద్‌లో జరిగిన హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ స్పీడ్ కిక్కింగ్, స్పీడ్ పంచింగ్ పోటీల్లో అచ్చంపేటకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. అమికబుల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో కరాటే మాస్టర్ రాజు నాయక్ మార్గదర్శకత్వంలో ఇచ్ డియెన్ కాన్వెంట్ స్కూల్ 8వ తరగతి విద్యార్థి గడ్డం అనుదీప్ యాదవ్ అండ్ టీమ్ పాల్గొన్నారు. 90 సెకన్లలో 100 ఆల్టర్నేట్ లెగ్ రౌండ్ హౌస్ కిక్స్, 200 పంచ్‌ల విభాగాల్లో అద్భుత ప్రదర్శన చేసి వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు. క్రీడాకారులను నిర్వాహకులు, తల్లిదండ్రులు అభినందించారు.

# ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన మండల కమిటీలు ఏర్పాటు



**హుస్నాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సైదాపూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం మండల ఇన్‌చార్జి మిట్టపల్లి రాజేష్ మాదిగ, కో ఇన్‌చార్జి మొలుగూరి అశోక్ మాదిగ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంద రాజు మాదిగ, జాతీయ నాయకులు రుద్రారపు రామచందర్ మాదిగ, ఎంఈఎఫ్ జాతీయ నాయకులు తాండ నరసయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మట్టెల రవీందర్ మాదిగ, ఎంఎస్పీ మాజీ మండల అధ్యక్షులు కాదపాక అశోక్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు సంఘాల తిరుపతి మాదిగ, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షులు జక్కోజు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ కమిటీలో అధ్యక్షుడిగా పొడిశెట్టి అజయ్ మాదిగ, అధికార ప్రతినిధిగా బోరగాల రమేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కొంకట సునీల్ మాదిగ, ప్రధాన కార్యదర్శి-2గా అందె ప్రవీణ్ మాదిగ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బోనగిరి స్వినోజ్ మాదిగ, మొలుగూరి రాజ్‌కుమార్ మాదిగ, పొడిశెట్టి విజయ్ మాదిగ, కోశాధికారిగా కొమ్ముల శ్రీనివాస్ మాదిగ, కార్యదర్శులుగా నమిండ్ల సాగర్ మాదిగ, బొజ్జ ప్రశాంత్ మాదిగ, బత్తుల తిరుపతి మాదిగ, బత్తుల కమలాకరం మాదిగ, సహాయ కార్యదర్శిగా కాశపాక కుమారస్వామి మాదిగను ఎన్నుకున్నారు. ఎంఎస్పీ కమిటీలో అధ్యక్షుడిగా ఎలుకపెల్లి పొలు మాదిగ, అధికార ప్రతినిధిగా కనకం తిరుపతి మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కొమ్ముల సమ్మయ్య మాదిగ, ప్రధాన కార్యదర్శి-2గా రుద్రారపు శ్రీధర్ మాదిగ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మిడిదొడ్డి జనార్ధన మాదిగ, కాశపాక సదానందం మాదిగ, నమిండ్ల బాబు మాదిగ, కోశాధికారిగా బోడిక సుకుమార్ మాదిగ, కార్యదర్శులుగా లంక దాసరి తిరుపతి మాదిగ, కాశపాక వెంకటేశం మాదిగ, అందె అనిల్ మాదిగ, ఫారునంది తిరుపతి మాదిగ, సహాయ కార్యదర్శిగా కొయ్యడ సమ్మయ్య మాదిగను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీలు సామాజిక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తూ సంఘం లక్ష్యాల సాధనకు కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

# సిఐటీయూలో చేరిన రైస్ మిల్ హమాలీలు



**సుల్తానాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రైస్ మిల్‌లో పనిచేస్తున్న టిఆర్ఎస్ కెవి లోకల్ హమాలీ కార్మికులు సిఐటీయూ నిర్వహిస్తున్న కార్మిక పోరాటాలకు ఆకర్షితులై 61 మంది కార్మికులు సిఐటీయూలో చేరారు. జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్మికులు సిఐటీయూ కండువాలు కప్పుకొని సంఘంలో చేరికను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటీయూ నిరంతరం పోరాడుతోందని, న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత, చట్టబద్ధమైన హక్కులు, పని ప్రదేశంలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఐక్యంగా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం రైస్ మిల్ హమాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా తాండ్ర అంజయ్య, అధ్యక్షుడిగా మీనుగు రాజు, ప్రధాన కార్యదర్శిగా చీకటి సారయ్య, ఉపాధ్యక్షుడిగా మంద శంకర్ స్వామి, కోశాధికారిగా కంకణాల కొమురయ్య ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా చీకటి చందు, గట్టు ఓదెలు, మల్లేష్, గుబెడ తిరుపతి ఎంపికయ్యారు. 61 మంది కార్మికులు సిఐటీయూలో చేరడం కార్మికుల ఐక్యతకు, పోరాటాలపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. భవిష్యత్‌లో కార్మిక హక్కుల సాధన కోసం మరిన్ని పోరాటాలు చేపడతామని తెలి పారు. ఈ కార్యక్రమంలో సిఐటీయూ సుల్తానాబాద్ మండల కో-కన్వీనర్ మాతంగి రాజమల్లు, హమాలీ కార్మికులు కుమార్, గు దుగుల సదానందం, రాజమల్లు, నితీష్, గంగారాం, ఉసైం రా జేశం, మేకల రాజు, కూడిది, సంజీవ్, శంకరయ్య, స్వామి, ఎల్ల య్య, రాజయ్య, శంకర్, సదయ్య, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై అవగాహనతోనే నియంత్రణ సాధ్యం ఎమ్మెల్యే కవ్వంపల్లి




**మానకొండూర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** క్యాన్సర్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ప్రజలకు వ్యాధిపై సరైన అవగాహన కల్పించి తొలిదశలోనే గుర్తించి చికిత్స పొందేలా చూడాల్సిన అవసరం ఉందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ జడ్పీ హైస్కూల్ ఆవరణలో అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రులకు వచ్చే కేసుల్లో ఎక్కువ శాతం మూడో, నాలుగో దశలోనే గుర్తించబడుతున్నాయని, తొలిదశలో గుర్తించే కేసులు చాలా తక్కువగా ఉన్నాయని తెలిపారు. వ్యాధి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ముందస్తుగా గుర్తిస్తే మెరుగైన చికిత్సతో వ్యాధిని నియంత్రించే అవకాశం ఉంటుందని చెప్పారు. క్యాన్సర్ బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన వారికి రూ.10 లక్షల వరకు వైద్య సేవలు అందుతున్నాయని, ఇకపై నియోజకవర్గంలో క్యాన్సర్ బాధితుల సమస్యల పరిష్కారానికి తనవంతు బాధ్యత తీసుకుంటానని, మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తానని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు.

# గ్రామ అభివృద్ధికి మంత్రి పొన్నం హామీ



**సిద్దిపేట జిల్లా, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలం శనిగరం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. "పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామంలో పర్యటించి, రూ.20 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. వన మహోత్సవంలో మొక్కలు నాటారు. గ్రామ పంచాయతీ వద్ద అధికారులతో సమీక్ష నిర్వహించి సంక్షేమ పథకాల అమలుపై వివరాలు తెలుసుకున్నారు. 46 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా, పింఛన్ల కింద కోట్ల రూపాయలు విడుదలైనట్లు వివరించారు. కొత్తగా 443 రేషన్ కార్డులు పంపిణీ చేసి, 327 యూనిట్లు అదనంగా చేర్చామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, అంగన్‌వాడీ భవనాలు, పశువైద్యశాల, పాఠశాల ప్రహరీ వంటి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు దృష్టి సారించాలని సూచిస్తూ, కోహెడ మండలంలో ఇప్పటికే 1,320 ఎకరాల్లో సాగు జరుగుతోందని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు 1,600 స్టీల్ బ్యాంక్ కిట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. హుస్నాబాద్‌లో కబడ్డీ అకాడమీ, గ్రామీణ ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నామని, పిల్లివాగు బ్రిడ్జి నిర్మాణానికి రూ.17 కోట్ల ప్రతిపాదనలు రూపొందించామని వెల్లడించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రజాపాలన కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, సర్పంచ్ లింగంపల్లి లక్ష్మయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఘనంగా పోతారం దేవాలయంలో మహా చండీయాగం



**హుస్నాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం గ్రామంలోని శ్రీ త్రిపుర భైరవి, వారాహి సహిత శ్రీ మహా ప్రత్యంగిరా దేవాలయంలో మహా చండీయాగం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. హైదరాబాద్‌కు చెందిన శ్రీ మహా గురు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాగంలో ఆలయ అర్చకులు పెరుమాండ్ల వేణుగోపాల రామకృష్ణ శర్మ, శ్రీ వెంకటరమణయ్య శిష్య బృందానికి చెందిన 80 మంది బ్రాహ్మణులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేదమంత్రోచ్ఛారణల మధ్య కలశ స్థాపన, పారాయణాలు, శ్రీ మహా చండీ హవనం, మహా పూజ, హారతి వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ మహా చండీయాగంలో సుమారు 400 మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్, సిద్దిపేట, మంచిర్యాల, జగిత్యాల, గోదావరిఖని, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివ చ్చారు. నిర్వాహకులు ప్రజలందరిపై అమ్మవారి అనుగ్రహం ఉండాలని, సమాజంలో సుఖశాంతులు, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసుల విస్తృత ఆపరేషన్



**నందికొట్కూరు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లా వ్యాప్తంగా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, అక్రమ కార్యకలాపాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికారులు, సిబ్బంది ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. నంద్యాల తాలూకా, పాములపాడు, సుండిపెంట, ముచ్చుమర్రి, శ్రీశైలం, బ్రాహ్మణకోట్కూరు ప్రాంతాల్లో ప్రధాన రహదారులు, అనుమానాస్పద ప్రాంతాలు, ఇళ్ల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాల ధ్రువపత్రాలను తనిఖీ చేసి, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెట్టారు. గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ మోసాల నివారణ, ఆన్‌లైన్ బెట్టింగ్ దుష్పరిణామాలు, బాల్య వివాహాల నిరోధం, మహిళల భద్రత, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. శక్తి యాప్ వినియోగం, డయల్ 100/112 సేవలపై ప్రజలకు సమాచారం అందించారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అక్రమ మద్యం, నాటు సారా, మాదకద్రవ్యాల తయారీ, విక్రయాలు లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక




# గ్రామ అభివృద్ధి, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం

## – మంత్రి పొన్నం




**హుస్నాబాద్ , ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆటో కార్మికులు సమ్మెకు వెళ్లకుండా ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 2012 తర్వాత ఆటో చార్జీలు పెరగలేదని, పెరిగిన ఇంధన ధరలు, వాహనాల ధరలు, నిర్వహణ ఖర్చులను పరిగణనలోకి తీసుకుని ఆటో చార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కమిటీలో ఆటో కార్మికుల ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, సంబంధిత వర్గాలను భాగస్వామ్యం చేసి న్యాయమైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని, త్వరలో అమలు చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఆటో కార్మికులపై ఆర్థిక భారం తగ్గించేందుకు విద్యుత్ ఆటోలను ప్రోత్సహిస్తున్నామని, ప్రతి ఆటోకు రూ. 1.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆటో కార్మికుల సమస్యలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమ్మె ద్వారా సమస్యలు పరిష్కారం కావని, చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కోహెడ మండలం గుండారెడ్డిపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న–-పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామంలో పర్యటించి, రూ. 18 లక్షలతో నిర్మించిన మహిళా సమైక్య భవనం, రూ. 15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించారు. గ్రామంలో 16 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. 170 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. గృహజ్యోతి పథకం కింద 456 మందికి ఉచిత విద్యుత్, 455 మందికి గ్యాస్ సబ్సిడీ అందుతోందని వివరించారు. రైతులకు రూ. 2.80 కోట్ల రుణమాఫీ జరిగిందని, రైతు బీమా కింద తొమ్మిది కుటుంబాలకు రూ. 45 లక్షలు అందాయని తెలిపారు. గ్రామ సమస్యలపై సర్పంచ్ పిల్లి బాబు దృష్టికి తీసుకువచ్చిన తాగునీరు, రహదారులు, సాగునీరు, విద్యుత్, పాఠశాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల భూసేకరణ కొనసాగుతోందని, త్వరలో పూర్తి చేసి సాగునీరు అందిస్తామని చెప్పారు. తంగలపల్లి–-బద్దిపడగ రహదారి పనులకు రూ. 6.50 కోట్లు, మరో రూ. 1.50 కోట్లు మంజూరైందని తెలిపారు. రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు దృష్టి సారించాలని సూచిస్తూ, జలసిరి పథకం కింద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి మొక్కలు నాటాలని కోరారు. పింఛన్ల దరఖాస్తులు ఈ నెల 31 వరకు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే ప్రజా పాలన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, సర్పంచ్ పిల్లి బాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బీజేపీ బూత్ అధ్యక్షుడిగా కొలిపాక కిరణ్ నియామకం



**హుస్నాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బీజేపీ పార్టీ బలోపేతం కోసం నాగారం గ్రామంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కొలిపాక కిరణ్ బూత్ అధ్యక్షుడిగా, మూడపెల్లి రమేష్ బూత్ కార్యదర్శిగా, భాషవేణి అజయ్ లాభార్థి ప్రాముఖ్‌గా, పాపర వేణి రాకేష్ మన్ కీ బాత్ ప్రాముఖ్‌గా, బత్తుల సంతోష్ సోషల్ మీడియా కన్వీనర్‌గా, ఎర్రవెల్లి రమేష్ బిఎల్ఎ2గా, భాషవేణి లత మహిళా మోర్చా ప్రాముఖ్‌గా ఎన్నుకోబడ్డారు. కార్యవర్గ సభ్యులుగా అరుణ్, సుధీర్, కుమార్, వెంకటేష్, సంపత్, రాజేష్ ఖన్నా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల ప్రబారి తోట స్వరూప, మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి అరుణ్, రత్నాకర్ రెడ్డి, భాషవేణి వెంకటేష్, సిద్ధిపేట జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు తోట సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి వలస సుభాష్ చంద్రబోస్



**హుస్నాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి బాలల హక్కులను పరిరక్షించేందుకు అన్ని వర్గాల ప్రజలు సమష్టిగా కృషి చేయాలని బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ప్రభుత్వం బాలల హక్కులను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. బాలలతో పనులు చేయిస్తే వెంటనే 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి బాలుడు విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని, బడి మానేసిన పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. సెప్టెంబర్‌లో రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో బాలల హక్కుల ప్రజా వేదిక ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యా హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు దుప్పట్లు, దోమతెరలు అందించడంతో పాటు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణ కోసం తమ సంస్థ రెండు దశాబ్దాలుగా కృషి చేస్తోందని తెలిపారు. తెలంగాణను బాల కార్మికులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# పని ప్రదేశాల్లో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించాలి

## – డాక్టర్ మాధవి శ్యామల




**నంద్యాల, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లా యువజన సంక్షేమ శాఖ--సెట్కూర్ ఆధ్వర్యంలో ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో మహిళల భద్రత, పోష్ యాక్ట్--2013పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ఇంటర్నల్ కంప్లైంట్ సెల్ చైర్‌పర్సన్, మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మాధవి శ్యామల పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టంలోని నిబంధనలు, అమలు తీరు, మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడంలో అధికారుల బాధ్యతలను వివరించారు. అనుచిత వ్యాఖ్యలు, సంజ్ఞలు, ప్రవర్తన రూపాల్లో వేధింపులు చోటుచేసుకోవచ్చని, విద్యార్థులు వాటిని గుర్తించి బాధితులకు సహకరించాలని సూచించారు. సెట్కూర్ సీఈఓ డాక్టర్ కె. వేణుగోపాల్ పోష్ చట్టం ఆవిర్భావం, రాజ్యాంగంలోని సమానత్వం, వివక్ష వ్యతిరేక హక్కులు, జీవన హక్కు వంటి ప్రాథమిక హక్కులు మహిళల భద్రతకు పునాదులని వివరించారు. కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సోఫియా విద్యార్థులు భవిష్యత్తులో పనిచేసే సంస్థల్లో మహిళలకు గౌరవప్రదమైన వాతావరణం కల్పించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అడ్వకేట్ ఝాన్సీరాణి మృతదేహానికి నివాళులు అర్పించిన డాక్టర్ యేకుల రాజారావు



**వంగూరు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం తిప్పారెడ్డి గ్రామానికి చెందిన గోకమళ్ల కృష్ణమ్మ, శ్రీనయ్య దంపతుల కుమార్తె, యువ న్యాయవాది గోకమళ్ల ఝాన్సీరాణి శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలుసుకున్న టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యేకుల రాజారావు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ యేకుల రాజారావు మాట్లాడుతూ.. ఝాన్సీరాణి ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ నుంచి న్యాయ విద్యను పూర్తి చేసి, హైదరాబాద్ హైకోర్టు సీనియర్ న్యాయవాది వద్ద జూనియర్ న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించారని తెలిపారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువ న్యాయవాది రోడ్డు ప్రమాదంలో అకాల మృతిచెందడం అత్యంత విషాదకరమన్నారు. హైదరాబాద్ కోఠిలో ఆర్టీసీ బస్సు ఝాన్సీరాణి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందడం తీవ్రంగా కలచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యను అభ్యసించి, తల్లిదండ్రులకు అండగా నిలవాల్సిన వయసులోనే ఆమె మృత్యువాత పడటం కుటుంబానికి తీరని లోటని అన్నారు. కన్న కూతురిని కళ్లముందే విగతజీవిగా చూసిన తల్లిదండ్రుల రోదనలు హృదయవిదారకంగా ఉన్నాయని, వారిని ఓదార్చి ధైర్యం చెప్పిన డాక్టర్ యేకుల రాజారావు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఝాన్సీరాణి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ నూనె సురేష్, మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు బోయిని చంద్రమౌళి, కార్యదర్శి మేడ సైదులు, ఎర్ర వెంకటయ్య, చేపూరి మురళి, నూనె జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి ఏఐటీయూసీ




**సుల్తానాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాష్ట్రవ్యాప్తంగా ఆటో జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి ప్రారంభమయ్యే ఆటోల బందుకు ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి సునీల్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల ఉపాధి, ఆత్మగౌరవం, జీవన్మరణ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఈ సమ్మెను ప్రజలు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్లు, యజమానులు ఉపాధి కోల్పోయి అడ్డా కూలీలుగా, వలస కార్మికులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోలు నడిపి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి లేకపోవడంతో పాటు ఆటో ఫైనాన్స్ చెల్లించలేక అనేక మంది డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఆటో డ్రైవర్ల ఆత్మగౌరవం, ఉపాధి హామీ, జీవన్మరణ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఈ బంద్‌కు ప్రజాస్వామికవాదులు, ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# వైభవంగా శ్రీ కట్ట మైసమ్మ తల్లి వార్షికోత్సవం

- ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలతో ఆధ్యాత్మిక సందడి
- అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు





**ఆమనగల్లు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని సురసముద్రం చెరువు కట్ట వద్ద కొలువుదీరిన శ్రీ కట్ట మైసమ్మ తల్లి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ చైర్మన్, 14వ వార్డు కౌన్సిలర్ మొక్తల వెంకటయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు సద్గురు శాంకరి అఘోరి మాత హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాల్లో పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, కంకణధారణ, గణపతి పూజ, బోనాల సమర్పణ, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం, అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, పొల్యూషన్ బోర్డ్ సభ్యుడు ఠాకూర్ బాలాజీ సింగ్, ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ పత్యనాయక్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత, హుజూర్ నగర్ సీఐ చలమంద రాజు, కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, ఎర్రవోలు మహేష్, ఏనుమల్ల రమేష్, కో-ఆప్షన్ సభ్యుడు అల్లాజీ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, మాజీ కౌన్సిలర్ విజయకృష్ణ, సుందూరు ఝాన్సీ శేఖర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, నాయకులు పాతకోట శ్రీశైలం, గోరటి భరత్, లండం మల్లేష్, పురుగుల శివ, గంగా రవి, చెన్నంశెట్టి మల్లేష్, మొక్తల చిన్న వెంకటయ్య, మొక్తల అంజయ్య, ఎర్రవోలు రాజు, మొక్తల సాయి, మొక్తల మణి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

# అంగరంగ వైభవంగా భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



**సుల్తానాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మండలంలోని కాట్నపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయంలో నవగ్రహ శివపంచాయతన సహిత భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు హాజరై స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు, గ్రామ ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. విజయ రమణ రావు మాట్లాడుతూ భక్తాంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఖానాపూర్‌లో ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



**ఆమనగల్లు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు ఠాకూర్ బాలాజీ సింగ్‌లతో కలిసి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, టాస్క్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, గ్రామం సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా ప్రజల ఐక్యత, భక్తి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనిత శ్రీనివాస్, ఆలయ నిర్మాణ దాత గోకికార్ రమేష్, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ యాట గీత, యాట నర్సింహా, పార్టీ మండల అధ్యక్షులు కాసు శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బొజ్జ వెంకట్రామ్‌రెడ్డి, నర్సింహా, మాజీ ఎంపీటీసీ గణేష్ గుప్తా, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నైట్ పెట్రోలింగ్‌పై సీపీ గౌష్ ఆలం ఆకస్మిక తనిఖీ



**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** శనివారం అర్ధరాత్రి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ఆకస్మికంగా నగరంలో పర్యటించి శాంతిభద్రతల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. రాజీవ్ చౌక్, శనివారం మార్కెట్, తెలంగాణ చౌక్, బైపాస్ రోడ్డులోని దాబా ప్రాంతాలను సందర్శించి నైట్ పెట్రోలింగ్, సిబ్బంది అప్రమత్తతను పరిశీలించారు. నిర్దేశిత సమయం దాటిన తర్వాత కూడా కొనసాగుతున్న హోటళ్లు, దాబాలు, టీ షాపులు, పాన్ షాపుల యజమానులను హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని సీపీ గౌష్ ఆలం తెలిపారు.

## ఘనంగా విఘ్నేశ్వర స్వామి, హనుమాన్ ఆలయాల భూమిపూజ నిర్వహణ



గోదావరిఖని/సుల్తానాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : రాజలక్ష్మి కాలనీలో విఘ్నేశ్వర స్వామి, హనుమాన్ ఆలయాల నిర్మాణానికి భూమిపూజ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది.కాలనీ అధ్యక్షుడు, సుల్తానాబాద్ 2వ వార్డు కౌన్సిలర్ గాజుల రాజమల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి, 35వ డివిజన్ కార్పొరేటర్ జంగపల్లి రమాదేవి శ్రీనివాస్, డాక్టర్ క్యాస శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి కాలనీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.నూతన ఆలయాల నిర్మాణంతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెంపొందుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక



రామడుగు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : రామడుగు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో దివ్యాంగుల సంఘం మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కంకణాల జనార్ధన్ అధ్యక్షుడిగా, పొన్నం మమత ఉపాధ్యక్షురాలిగా, చిమ్మళ్ళ శ్రీనివాస్ ఉపాధ్యక్షుడిగా, చిలుముల కవిత ప్రధాన కార్యదర్శిగా, పున్నం శ్రీనివాస్ కోశాధికారిగా, పున్న కనకయ్య కార్యదర్శిగా, బోయిని రవి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఉమ్మెత్తల శ్రీనివాస్ రెడ్డి, పున్నం సంతోష్, కోడె కనుకయ్య ఎంపికయ్యారు.నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ మండలంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులు, సంక్షేమ పథకాల సాధన కోసం న్యాయమైన పోరాటం చేస్తామని తెలిపారు. నూతన కమిటీకి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## బూత్ అధ్యక్షుడిగా పిట్టల సంతోష్ కుమార్ నియామకం



హుస్నాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : భారతీయ జనతా పార్టీ మహ్మదాపూర్ గ్రామ 26వ బూత్ నూతన అధ్యక్షుడిగా పిట్టల సంతోష్ కుమార్‌ను సీనియర్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో నియమించారు.ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను శిరసావహించి క్షేత్రస్థాయి నుండి పార్టీని బలోపేతం చేస్తానని, ప్రజా సమస్యలపై త్వరితంగా స్పందించి పార్టీ ఉద్దేశాలను ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, మండల ఇన్‌చార్జి తోట స్వరూప, జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్లి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు బూతుగడ్డ బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శులు తడిసిన రత్నాకర్ రెడ్డి, బైరి అరుణ్, మండల సీనియర్ నాయకుడు మహేందర్ రెడ్డి, గ్రామ మాజీ బూత్ అధ్యక్షుడు బొల్లి సుధాకర్ పాల్గొన్నారు.గ్రామ బీజేపీ కార్యకర్తలు మెరుగు రవీందర్, బొల్లి గణేష్, అల్లువెల్లి రాకేష్, ఎలవేని శ్యాము, జెట్టి బన్నీ, బైరి సంపత్, బొల్లి పవన్, బొల్లి నాగరాజు మరియు గ్రామ ప్రజలు కూడా హాజరయ్యారు.

## సేవా స్ఫూర్తితో మెగా రక్తదాన శిబిరం




పెద్దపల్లి, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : మమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి మర్కజ్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంబి గార్డెన్స్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ నాయకురాలు, బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా చైర్మన్ దాసరి ఉష హాజరై, తలసేమియా బాధితుల కోసం రక్తదానం చేయడం మానవత్వానికి ఆదర్శమని పేర్కొన్నారు.కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రఫీక్ ఉల్లా ఖాన్, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ ఆసిఫ్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ మురాజ్, లీగల్ అడ్వైజర్ సయ్యద్ మస్రత్, సయ్యద్ మజీద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండి ఇమ్రాన్, వాజిద్, మీడియా ఇన్‌చార్జ్ అబ్దుల్ మాలిక్, ఎండి అజీమ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ భవిష్యత్ సేవా కార్యక్రమాలపై కార్యాచరణ



కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : లైన్స్ ఇంటర్నేషనల్ 320జి రీజన్ టు సమావేశం ఆదివారం రాజరాజేశ్వరి లైన్స్ క్లబ్ సమావేశ మందిరంలో రీజన్ చైర్‌పర్సన్ రాళ్లబండి శంకర్ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.సమావేశంలో రీజన్‌కు చెందిన పది క్లబ్బుల పిఎస్‌టిలతో చర్చలు జరిగాయి. ముఖ్య అతిథిగా పూర్వ జిల్లా గవర్నర్ సిదుర సురేష్, జోన్ చైర్‌పర్సన్స్ గుండా రాజశేఖర్, మాన్వాడ శంకర్, ముక్క శరత్ కృష్ణ, రీజన్ కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి, మైక్రో క్యాబినెట్ సభ్యులు పుల్లూరి ప్రభాకర్, గోలి మధుసూదన్ రెడ్డి, కర్ర శ్యాంసుందర్ రెడ్డి, ఇనుగుర్తి రమేష్ పాల్గొన్నారు.లయనిస్టిక్ ఇయర్ 2026--27 జూలై నుంచి ఆగస్టు వరకు వివిధ క్లబ్బులు చేపట్టిన సేవా కార్యక్రమాలు, చేయబోయే కార్యక్రమాలను సమావేశంలో చర్చించారు. పూర్వ గవర్నర్ సిదుర సురేష్ మాట్లాడుతూ లైన్స్ క్లబ్ సభ్యత్వం ఒక వరమని, అనేక సేవా కార్యక్రమాలు చేసే అవకాశం ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ సభ్యులకే ఉందని అన్నారు.ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ సభ్యులను సన్మానించారు.

## ఉచిత ఆర్థో వైద్య శిబిరంతో ప్రజలకు ఊరట



హుస్నాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : హుస్నాబాద్ పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో శ్రీకర హాస్పిటల్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత ఆర్థో వైద్య శిబిరం నిర్వహించారు.వైద్యులు సుమారు 250 మందికి పరీక్షలు చేసి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ తాను హుస్నాబాద్ ప్రాంతానికి చెందినవాడినని, ఇక్కడి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్‌లోనూ అవసరమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.కార్యక్రమంలో డాక్టర్ పెద్ది సాయికిరణ్, డాక్టర్ శివకృష్ణ, వంశీ, రఘుపతి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు సొల్లేటి శంకరయ్య, కార్యదర్శి గౌరిశెట్టి రాజు, కోశాధికారి బబ్బుల రవీందర్, యూత్ అధ్యక్షుడు కంభంపాటి సందీప్, కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు బెజగం బాలకృష్ణయ్య, గీతా మందిరం అధ్యక్షుడు నిర్మల లక్ష్మీనారాయణ, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి కాపర్తి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బిల్లుల చెల్లింపుపై లిబరేషన్ పార్టీ ధర్నా



నందికొట్కూరు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నందికొట్కూరు మండల పరిధిలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ బిల్లులు ఈఆర్ఓ సెంటర్లలోనే కొనసాగించాలని లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది.జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వినియోగదారులు ఇబ్బంది పడకుండా గతంలో ఉన్న ఈఆర్ఓ సెంటర్ల విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మీ సేవా కేంద్రాలు, సచివాలయాలు, మొబైల్ యాప్‌లు, ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయాలని చెప్పడం సరైనది కాదని, అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని విమర్శించారు.ప్రజలు, రైతులు, కూలీలు పనులు వదులుకొని బిల్లులు కట్టడానికే సమయం వెచ్చించాల్సి వస్తోందని, అందువల్ల ప్రభుత్వం పాత విధానాన్ని తిరిగి అమలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కె. స్వామన్న, టౌన్ కార్యదర్శి బి. రామకృష్ణ, ఈ. భాస్కర్ గౌడ్, మిడుతూరు మండల కార్యదర్శి మేకల చంద్రశేఖర్, వడ్డే సుధాకర్, పగిడ్యాల మండల కార్యదర్శి గుంపుల త్యాగరాజు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. బీబీ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం సీనియర్ కామ్రేడ్ గోదాస్ యాదయ్య మృతి



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మేడిపల్లి సీపీఎం పార్టీ సీనియర్ కామ్రేడ్ గోదాస్ యాదయ్య అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల సీపీఎం నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.యాదయ్య మృతిచెందిన విషయం తెలుసుకున్న యాచారం మండల సీపీఎం కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ పార్టీ నాయకులతో కలిసి ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాదయ్య పార్టీకి చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు.కార్యక్రమంలో సీపీఎం పార్టీ కార్యవర్గ సభ్యుడు అలంపల్లి జంగయ్య, మండల కమిటీ సభ్యుడు ఎండీ జాంగిర్, శాఖ కార్యదర్శులు ముచ్చర్ల లాజర్, గడ్డం కుమార్, వడ్డెమోని భూషణ్, పార్టీ సభ్యులు గో దాస్ మల్లయ్య, గజ సాలయ్య, జక్కర్త యా దయ్య, మడ్డి యాదమ్మ, బూర దేవయ్య, సింధం జంగయ్య, ముచ్చర్ల నరసింహ తదితరులు పాల్గొని యాదయ్యకు నివాళులర్పించారు.

## జంతుక మైసమ్మ మృతికి పత్యనాయక్ నివాళి



ఆమనగల్లు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లికి చెందిన మాజీ వార్డు సభ్యుడు జంతుక అల్లాజి తల్లి జంతుక మైసమ్మ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. మైసమ్మ మృతి విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ జంగారెడ్డిపల్లికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయనతో పాటు కౌన్సిలర్లు దుడ్డు ఆంజనేయులు, అనుష శ్రీశైలం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల రాములు యాదవ్ తదితరులు మైసమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మైసమ్మ మృతి కుటుంబ సభ్యులకు, బంధువులకు తీరని లోటని పేర్కొన్నారు. మైసమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## భారతమ్మకు ఘన నివాళులు



**- దశదిన కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు.. నరేందర్ రెడ్డిని పరామర్శించిన నేతలు**

ఆమనగల్లు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామ సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి మాతృమూర్తి భారతమ్మ దశదిన కార్యక్రమం ఆదివారం గ్రామ పరిధిలోని ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి హాజరై భారతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ, ఆదివాసీ రాష్ట్ర నాయకుడు కృష్ణ నాయక్, నాయకులు తల్లోజు రామకృష్ణ, అబ్దుల్ అలీమ్, కొండల్ రెడ్డి, షాబ్బుద్ధీన్, నాజర్, షఫీ, గుద్దేటి శివ

## తిరుపతి గౌడ్‌ను పరామర్శించిన జైపాల్ యాదవ్

**- పెంటయ్య మృతిపై సంతాపం.. కుటుంబ సభ్యులకు ధైర్యం**



ఆమనగల్లు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కడ్తాల్ వార్త రిపోర్టర్ తిరుపతి గౌడ్ తండ్రి వల్లభూదాస్ పెంటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆదివారం ఆకుతోటపల్లిలోని తిరుపతి గౌడ్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెంటయ్య మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ పెంటయ్య మృతి కుటుంబానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అర్జున్ రావు, లక్ష్మీ నరసింహారెడ్డి, గౌని లాలయ్య గౌడ్, చిటు గోరి భాస్కరరావు, రంగయ్య, బర్ల వెంకటయ్య, సర్పంచ్ శ్రీను నాయక్, శ్రీను, బాలయ్య గౌడ్, నిరంజన్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, యాదగిరి తదితరులు పాల్గొని తిరుపతి గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు.

## జీఓ97 రద్దుపై గురుకుల విద్యార్థులతో గంగుల ముఖాముఖి




కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ మోడల్ గురుకుల పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో జీఓ97 రద్దుపై విద్యార్థులతో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు.విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేసిన గంగుల కమలాకర్ జీ ఓ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్‌వి నేత పొన్నం అనిల్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గ్రామ నూతన కమిటీ ఎన్నిక



హుస్నాబాద్ , ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : మహ్మదాపూర్ గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడు వెన్న రాజు, యువజన అధ్యక్షుడు శ్రీశైలం, డిసిసి అధ్యక్షుడు మామిడి తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు సంఘ శ్రీధర్ సమక్షంలో కమిటీ ఎన్నిక జరిగింది.దుద్దెడ శ్రీనాథ్ గౌడ్‌ను గ్రామ శాఖ అధ్యక్షుడిగా, బొల్లి నాగరాజును ప్రధాన కార్యదర్శిగా, శ్రీరాముల చందును యువజన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త కమిటీ ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తూ గ్రామంలో పార్టీని బలోపేతం చేయాలని సంకల్పం వ్యక్తం చేసింది.కార్యక్రమంలో ఉప సర్పంచ్ కత్తుల సమ్మరాజు, వార్డు సభ్యుడు బొల్లి తిరుపతి, మెరుగు వెంకటి, కాంగ్రెస్ నాయకులు జిల్లెల్ల తిరుపతిరెడ్డి, బొల్లి రామచంద్రం, రావుల నారాయణ, దుద్దెడ తిరుపతి, ఆకుల వెంకటస్వామి, యువజన సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవా పురస్కారం 2026 అందుకున్న గాలిపెల్లి కుమార్




కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ బొమ్మకల్ 6వ డివిజన్‌కు చెందిన గాలిపెల్లి కుమార్‌కు ఉత్తమ సేవా పురస్కారం అవార్డు--2026 లభించింది.ఫ్రెండ్స్ కల్చరల్ అకాడమీ, చిరంజీవి హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాభారతిలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును డీఎస్పీ ప్రతాప్, జబర్దస్త్ నటుడు జీవన్, 6వ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మిడిదొడ్డి కపిల్ మాధవ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా పలువురు గాలిపెల్లి కుమార్‌ను అభినందించారు. ఆయన రక్తదానం చేయాలని, ప్రాణదాతలుగా నిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## ఉత్తమ సేవా పురస్కార్ 2026 అందుకున్న శ్రీనివాస్ రెడ్డి వూట్కూరి




కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవం సందర్భంగా తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వూట్కూరికి ఉత్తమ సేవా పురస్కార్ --2026ను ఫ్రెండ్స్ కల్చరల్ అకాడమీ, చిరంజీవి హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఘనంగా ప్రదానం చేసింది.సమాజ సేవ పట్ల అంకితభావంతో ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ గౌరవాన్ని అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి వూట్కూరి మాట్లాడుతూ ఈ పురస్కారం తన ఒక్కరి కృషికి దక్కిన గౌరవం కాదని, సేవా కార్యక్రమాల్లో నాతో పాటు నడుస్తున్న ప్రతి శ్రీనివాసుడికి, ప్రతి సేవా సహచరుడికి దక్కిన గౌరవమని భావిస్తున్నానని అన్నారు. మానవత్వమే మార్గమని, ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా మరింత అంకితభావంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు.ఈ పురస్కారం తమ సేవా సంకల్పానికి మరింత ప్రోత్సాహం, బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ, ఈ గౌరవాన్ని అందించిన ఫ్రెండ్స్ కల్చరల్ అకాడమీ, చిరంజీవి హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ నిర్వాహకులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## లక్కీ ఉడిపి హోటల్‌ను ప్రారంభించిన వొడితల ప్రణవ్



హుజురాబాద్ , ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : హుజురాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డులో లక్కీ ఉడిపి హోటల్‌ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, పట్టణ అధ్యక్షుడు తిరుపతి, కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామ హృదయ కలశ శోభాయాత్ర



అమ్రాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం ఐనోల్ గ్రామంలో శ్రీరామ హృదయ కలశ శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర గ్రామ వీధుల గుండా భజనలతో సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. అనంతరం కలశాన్ని ప్రతిష్టించి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పిడికెడు బియ్యాన్ని కలశంలో సమర్పిం చారు.కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త పాపిశెట్టి అశోక్ కుమార్, మండల సమన్వ యకర్త బైరు శ్రీనివాసులు, సర్పంచ్ సభావత్ శంకర్ నాయక్, ఉప సర్పంచ్ కొట్టెం మధు, కమిటీ సభ్యులు సభావత్ సీతారాం, సభావత్ ఆంజనేయులు నాయక్, పర్వత రెడ్డి, దాసరి బుచ్చిరెడ్డి, కొట్టా సత్యనారాయణ, తిరుపతయ్య, లక్ష్మయ్య, కొట్టం ఆంజనేయులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. నిజా మాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్, సిద్దిపేట, మంచిర్యాల, జగిత్యాల, గోదా వరిఖని, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## హామీల అమలుపై కూటమి నేతల ఇంటింటి ప్రచారం



నందికొట్కూరు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నందికొట్కూరు పట్టణంలోని నాలుగో వార్డులో ఆదివారం 77వ బూత్‌లో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమ లు, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు.యూనిట్ ఇంచార్జి వడ్డె శ్రీను, బి. సురేష్ వార్డు ప్రజలకు వివరాలు తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

## ప్రత్యేక ఓటు నమోదు క్యాంపు కార్యాలయం ఏర్పాటు



**నందికొట్కూరు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పాములపాడు మండలంలోని మిట్టకందల మజారా వాల్మీకి నగర్, బుద్దానగర్ గ్రామాల్లో ఓటర్ల కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహించారు. ఎలక్షన్ కమిషన్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా, తహసిల్దార్ జి. సుభద్రమ్మ ఆదేశాల మేరకు జరిగిన ఈ క్యాంపులో బిఎల్ఓ షేక్ ముర్తుజావలి మాట్లాడుతూ ఓటర్ల మార్పులు, చేర్పులు, ఒక వార్డు నుంచి మరొక వార్డుకు మార్పులు, 18 ఏళ్లు నిండినవారి కొత్త ఓటు నమోదు, నియోజకవర్గ మార్పులు చేసుకోవచ్చని తెలిపారు. 224వ బూత్‌కు చెందిన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ కల్చరల్ అధ్యక్షుడు భావన వినోద్ కుమార్, తలారి లింగాల రాము, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పంట నష్టంపై రైతుల తీవ్ర ఆవేదన



**నందికొట్కూరు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొని, వర్షపాతం లోపం కారణంగా బొల్లవరం గ్రామంలోని మొక్కజొన్న పంటలు పూర్తిగా ఎండిపోయాయి. రైతులు పెట్టుబడులు వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటను కాపాడుకునే పరిస్థితి లేక ఎండిపోయిన మొక్కజొన్నను పశువులకు మేతగా వదిలేస్తున్న దయనీయ పరిస్థితి నెలకొంది. సామాజిక సేవకుడు గుజ్జుల గౌరీశ్వర్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు రైతులతో కలిసి పంటను పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి, రైతులకు ఆర్థిక సహాయం అందించాలని వారు కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులు అప్పుల ఊబిలో పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, గొర్రెల కాపారులు పాల్గొన్నారు.

## రూ.10 వేల ఆర్థిక సాయంతో బాధిత కుటుంబానికి అండ

**– రాములు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్**



**ఆమనగల్లు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన దేరంగుల రాములు అనారోగ్యంతో బాధపడుతూ అకాల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు అధినేత, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ ఆదివారం మృతుడు రాములు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాములు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పుట్టెడు దుఃఖంలో ఉన్న భార్యాపిల్లలు, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రాములు అకాల మరణం అత్యంత బాధాకరమని, ఆయన కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు. కుటుంబానికి ఎలాంటి కష్టం రాకుండా ఆర్థికంగా, సామాజికంగా అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు. రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ద్వారా జర్పుల దశరథ్ నాయక్ రూ.5 వేలు, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.5 వేలు కలిపి మొత్తం రూ.10 వేల తక్షణ ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రియ రమేష్ నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, వార్డు సభ్యుడు గణేష్ గౌడ్, నాయకులు మంగళపల్లి నరసింహ, శ్రీను, యాదయ్య,
జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## భారతమ్మకు ఘన నివాళి.. కుటుంబ సభ్యులకు పరామర్శ



**ఆమనగల్లు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామ సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి మాతృమూర్తి స్వర్గీయ భారతమ్మ ద్వాదశ దినకర్మ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా భారతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన వార్తా రిపోర్టర్ తిరుపతయ్య గౌడ్ తండ్రి కీ.శే. వల్లబుధాస్ పెంటయ్య ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న రాఘవేందర్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెంటయ్య మృతికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పత్యా నాయక్, సైదులు, వెంకటయ్య, ఫౌండేషన్ సభ్యుడు శ్రీరాములు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్‌నగర్ కాలనీలో ఘనంగా బోనాల వేడుకలు



**బోడుప్పల్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బోడుప్పల్ నగరంలో ఆదివారం బోనాల పండుగ సందడి నెలకొంది. నగరంలోని వివిధ కాలనీల్లో గ్రామదేవతలకు భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలను అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించడంతో కాలనీల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రాజీవ్‌నగర్ కాలనీతో పాటు డబుల్ బెడ్‌రూమ్ నివాస ప్రాంతంలోని మహిళలు శ్రీ బంగారు మైసమ్మ తల్లి, శ్రీ ఎల్లమ్మ తల్లి, కొండపోచమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. మాలతి, పల్లె మంగమ్మ, ఆనందదాసు మంజుల, చిప్పల రజిని, ఈదుల రేణుక, బాలమణి, జయమ్మ, విజయ, ఉమ, గాయత్రి, తుక్కోజీ, మమత, ఉప్పలమ్మ, దేవమ్మ, భాగ్యలక్ష్మి, మహాలక్ష్మి, నీరజ, మాధవి, కీర్తన తదితరులు పాల్గొని గ్రామదేవతలకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## రాజీవ్‌నగర్ కాలనీలో ఘనంగా తొట్టెల ఊరేగింపు



**బోడుప్పల్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బోడుప్పల్ సర్కిల్--10 పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో బోనాల పండుగను పురస్కరించుకుని ఆదివారం తొట్టెల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. రాజీవ్‌నగర్ కాలనీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొండపోచమ్మ, చిత్తరమ్మ అమ్మవార్లకు తొట్టెలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోడుప్పల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దానగాళ్ల యాదగిరి హాజరై కొబ్బరికాయ కొట్టి తొట్టెల ఊరేగింపును ప్రారంభించారు. యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డి రమేష్, ప్రధాన కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపులో యువకులు, మహిళలు, బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డప్పుల మోతలు, నృత్యాలతో యువత ఉత్సాహంగా సందడి చేయడంతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పల్లె వెంకటరమణ, డబుల్ బెడ్‌రూమ్ అధ్యక్షుడు చిప్పల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి తుక్కోజీ అమరేందర్, అజీజ్ బాయ్, గోరిగే సంతోష్‌కుమార్, ఈదుల వెంకటేష్‌తో పాటు రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన యువకులు, మహిళలు, బస్తీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తుల్జా భవాని ఆలయ నిర్మాణానికి సర్పంచ్ శ్రీనునాయక్ చేయూత

**– పైకప్పు బండలతో పాటు రూ.61 వేల విరాళం అందజేత**



**ఆమనగల్లు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నతండాలో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని దేవి ఆలయ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ వడ్త్యావత్ శ్రీనునాయక్ అదివారం తన వంతు సహకారం అందించారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన పైకప్పు బండలను సమకూర్చడంతో పాటు రూ.61 వేల నగదు విరాళాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన కమిటీ సభ్యులతో మాట్లాడి నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనునాయక్ మాట్లాడుతూ.. గ్రామంలో ఆలయ నిర్మాణం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఆలయ నిర్మాణం పూర్తయితే చిన్నతండాతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా ఆధ్యాత్మికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి గ్రామస్థులు, దాతలు తమ వంతు సహకారం అందించి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని తెలిపారు. ఆలయ కమిటీ నిర్వాహకులు సర్పంచ్ శ్రీనునాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆయన అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజేశ్వరి మోహన్, ఆలయ కమిటీ సభ్యులు పరమేష్, పీక్ల నాయక్, కిషోర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ అభివృద్ధే నా జీవిత లక్ష్యం: మంత్రి కోమటిరెడ్డి

**– రూ.2 కోట్లతో నల్లగొండ క్లబ్‌లో అదనపు గదులు, కాన్ఫరెన్స్ హాల్ ప్రారంభం**



**నల్లగొండ, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ పట్టణాన్ని సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడంతో పాటు నల్లగొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన జీవిత లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని నల్లగొండ క్లబ్‌లో రూ.2 కోట్లతో నిర్మించిన అదనపు గదులు, కాన్ఫరెన్స్ హాల్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్లగొండ పట్టణ ప్రజలకు 24 గంటల పాటు తాగునీటిని అందించేందుకు రూ.125 కోట్లతో చేపట్టిన పనులను మరో ఆరు నెలల్లో పూర్తి చేసి నిరంతర నీటి సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులను 2028 ఆగస్టు నాటికి పూర్తి చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో అవసరమైన నిధులను సమకూర్చుకుంటూ పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. సొరంగం పూర్తయితే నల్లగొండ, ఉమ్మడి జిల్లాలోని సాగునీటి అవసరాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. నల్లగొండ పట్టణ సమగ్ర అభివృద్ధిలో భాగంగా రూ.900 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టామని, సుమారు రూ.1,400 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. రూ.300 కోట్లతో అండర్‌డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయడంతో పాటు ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డబుల్ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యారంగ అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. బొట్టుగూడ పాఠశాల అభివృద్ధికి రూ.12 కోట్లు కేటాయించామని, పాత టౌన్‌లో రూ.10 కోట్లతో ఆధునిక లైబ్రరీ నిర్మించడంతో పాటు విద్యార్థులకు కోచింగ్, ఫౌండేషన్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నల్లగొండలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హ్యామ్ రోడ్ల అభివృద్ధికి రూ.13 వేల కోట్లతో పనులు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రహదారుల అభివృద్ధికి రూ.2,500 కోట్లతో వివిధ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నల్లగొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

## ప్రతి ఒక్కరూ మహాలక్ష్మమ్మ తల్లి అనుగ్రహం పొందాలి

**– దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్**



**దేవరకొండ, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రతి ఒక్కరూ మహాలక్ష్మమ్మ తల్లి అనుగ్రహం పొందాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి రమావత్ రవీంద్ర కుమార్ ఆకాంక్షించారు. ఆదివారం చందంపేట మండలం గువ్వలగుట్ట గ్రామంలో నిర్వహించిన మహాలక్ష్మమ్మ పండుగకు ఆయన హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ మహాలక్ష్మమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలంతా భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మమ్మ పండుగను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. మహాలక్ష్మమ్మ తల్లి కరుణాకటాక్షాలతో గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరి కుటుంబాల్లో సుఖశాంతులు, ఆనందం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలంతా ఐకమత్యంతో పండుగలను నిర్వహించుకోవడం ద్వారా గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు మరింత బలోపేతమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య, రమావత్ మోహన్ కృష్ణ, కేతావత్ శంకర్ నాయక్, రమావత్ రాజా, రమావత్ బాలు, వడత్య బాలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు ఆర్థిక భరోసా

**– తలకొండపల్లిలో రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**



**కల్వకుర్తి, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఆర్థిక భరోసాగా నిలుస్తోందని తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, లింగరావుపల్లి గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం లింగరావుపల్లి గ్రామానికి చెందిన బొచ్చుపల్లి పెద్ద జంగయ్యకు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం కాసు శ్రీనివాస్‌రెడ్డి స్వయంగా అందజేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఈ ఆర్థిక సాయం మంజూరైంది. ఈ సందర్భంగా కాసు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలు తమ దృష్టికి తీసుకొస్తే, వారికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని కాసు శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు భాస్కర్‌రెడ్డి, పోతిరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, బసప్ప, శేఖర్‌గౌడ్, యాదయ్య, జంగయ్య, శ్రీధర్, రబ్బానీ, శివారెడ్డి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మిలాద్-ఉన్-నబీ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

**– నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: కల్వకుర్తి ఎస్ఐ కురుమూర్తి**



**కల్వకుర్తి, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలో ఈనెల 26న నిర్వహించనున్న పవిత్ర మిలాద్-ఉన్-నబీ ఊరేగింపును శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించాలని కల్వకుర్తి ఎస్ఐ కురుమూర్తి సూచించారు. ఆదివారం కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో మిలాద్-ఉన్-నబీ వేడుకల నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కురుమూర్తి మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త జన్మదినం శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రవక్త అందించిన శాంతి సందేశాన్ని చాటిచెప్పేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఊరేగింపును నిర్దేశిత సమయానికి ప్రారంభించి, నిర్ణయించిన గడువులోగా ముగించుకోవాలని సూచించారు. సుప్రీంకోర్టు, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా అధిక శబ్ద కాలుష్యానికి కారణమయ్యే డీజేలు, సౌండ్ సిస్టమ్స్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని స్పష్టం చేశారు. వేడుకల్లో ఆధ్యాత్మిక వాతావరణానికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం, ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్, సైలెన్సర్లు తొలగించి ర్యాష్ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఎస్ఐ హెచ్చరించారు. నిర్ణీత సమయానికి ముందు ఎలాంటి బైక్ ర్యాలీలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ దీపాల ఒకరణల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జెండాలు విద్యుత్ తీగలకు తగలకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, అన్నదాన కేంద్రాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్వాహకులు, వాలంటీర్లు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. మిలాద్-ఉన్-నబీ వేడుకల సందర్భంగా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, ఉద్దేశపూర్వక వ్యాఖ్యలు చేసే వారిపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారని ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. రౌడీషీటర్ల కదలికలపైనా ప్రత్యేకంగా నిఘా ఉంటుందని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ శాంతి సమావేశంలో కల్వకుర్తి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్‌తో పాటు మిలాద్-ఉన్-నబీ వేడుకల నిర్వాహకులు, ఇతరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం



**కల్వకుర్తి, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. కల్వకుర్తి మండలం గుందూర్ గ్రామానికి చెందిన కానుగుల శ్రీను అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ముందుకు వచ్చింది. శ్రీను మృతి చెందిన విషయం గ్రామ బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్‌రావు, గ్రామ సర్పంచ్ అయిననేని లక్ష్మమ్మ ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించి, వారికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు తన వంతు సహాయం అందించడం బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయిన బాధలో ఉన్న శ్రీను కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. భవిష్యత్తులోనూ నిరుపేదలు, ఆపదలో ఉన్న కుటుంబాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్మిక సంఘం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ సూర్యప్రకాష్‌రావు, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ నాగయ్య, మాజీ ఉపసర్పంచ్ బండి లక్ష్మయ్య, వార్డు సభ్యుడు రాజేందర్, పోతరపల్లి కృష్ణయ్య, పోతుగంటి నాగేంద్రం, తుప్పల సత్యనారాయణ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
సోమవారం, ఆగస్టు 24, 2026



# నాడు మామ.. నేడు కోడలు.. గ్రామ అభివృద్ధికి బాటలు

**- ప్రజల మన్ననలు పొందుతున్న ర్యాకల్‌దేవ్‌పల్లి సర్పంచ్ మద్దెల రమాదేవి--సంపత్**
**- గ్రామ అభివృద్ధి.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం**
**- ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికీ చేరేలా కృషి**



**ఎలిగేడు, ఆగస్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నాడు మామ.. నేడు కోడలు.. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు తరాల ప్రజాప్రతినిధులు గ్రామ అభివృద్ధికి అంకితమై పనిచేస్తుండటం ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామంలో ప్రత్యేకతగా నిలుస్తోంది. గ్రామాభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్న సర్పంచ్ మద్దెల రమాదేవి--సంపత్ తనదైన పాలనా శైలితో ప్రజల మన్ననలు పొందుతున్నారు.ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామ సర్పంచ్ రమాదేవి మామయ్య మద్దెల మల్లయ్య 1991లో సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి గ్రామ ప్రజల కనీస అవసరాలైన మంచినీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశారు. నాడు ఆయన వేసిన అభివృద్ధి బాటలోనే నేడు కోడలు రమాదేవి పయనిస్తూ గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారు. 2025 డిసెంబర్‌లో సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రమాదేవి గ్రామ ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో గ్రామస్తులను భాగస్వాములను చేస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతలను నిర్ణయించుకుని ముందుకు సాగుతున్నారు. బాధ్యతలు చేపట్టిన కొద్దికాలంలోనే గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణం, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.గ్రామంలోని రహదారులను మెరుగుపరచడంతో పాటు రాత్రివేళల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా వీధుల్లో తగినంత వెలుతురు ఉండేలా స్ట్రీట్ లైట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, ప్రజా సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పంచాయతీ పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నారు.గ్రామ ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వారి సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకుంటున్న సర్పంచ్ రమాదేవి సేవలను పలువురు అభినందిస్తున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మద్దెల రమాదేవి--సంపత్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికీ చేరేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో ఇంకా అవసరమైన మౌలిక వసతులను గుర్తించి దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. రాబోయే రోజుల్లో ర్యాకల్‌దేవ్‌పల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.గ్రామాభివృద్ధికి నాడు మామ మద్దెల మల్లయ్య వేసిన బాటలో నేడు కోడలు రమాదేవి సాగుతున్న తీరు.. ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతోంది.

# రాష్ట్ర ఆటో బంద్‌ను విజయవంతం చేయాలి

**- ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి**
**- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్**



**అమ్రాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బంద్‌కు సంబంధించిన సమావేశాన్ని యూనియన్ అధ్యక్షుడు సక్రు నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, జిల్లా సహాయ కార్యదర్శి మాడుగుల నరసింహ హాజరై బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా మారేడు శివశంకర్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఆర్టీసీ తర్వాత అత్యధికంగా ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నది ఆటో రంగమేనని అన్నారు. నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసుకుని, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రజలకు రవాణా సేవలు అందిస్తూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. లక్షలాది మంది ఆటో డ్రైవర్లు తమ కుటుంబాలను ఆటో రంగంపై ఆధారపడి పోషించుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజలకు నిత్యం రవాణా సౌకర్యం అందిస్తున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఆటో రవాణా రంగంలోని డ్రైవర్లు, కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ యాజమాన్యానికి ఈవీ ఆటోలు ఇవ్వాలనే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని కోరారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని, ప్రతిరోజూ ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించే ఆటో డ్రైవర్లను చలాన్ల నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు.జీవో నంబర్ 263లో మిగిలిన ఆటోలను వెంటనే అందించాలని, వాహన సారథి హోటల్‌లో ఆటో డ్రైవింగ్ లైసెన్సుల ప్రక్రియను కొనసాగించాలని కోరారు. యాక్సిడెంట్ బీమా సదుపాయాన్ని కొనసాగించడంతో పాటు సాధారణ మరణాలకు కూడా బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు పూర్తయిన ఆటో డ్రైవర్లకు పింఛన్ సౌకర్యం కల్పించాలని, ఆత్మహత్యలకు పాల్పడిన ఆటో కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు.ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న రాష్ట్రవ్యాప్త బంద్‌లో ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మారేడు శివశంకర్ కోరారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆటో యూనియన్ అధ్యక్షుడు సక్రు నాయక్, ప్రశాంత్, అనిల్, తిరుపతి, సన్నీ, అఖిల్, అర్జున్‌తో పాటు పలువురు ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# ఎడమామె అంటే ఏంటో తెలుసా.. ఆరోగ్యానికి ఇది ఎంతలా ఉపయోగపడుతుందంటే..



ఎడమామె సాధారణ స్నాక్‌లకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది. ఇందులో ప్రోటీన్, ఫైబర్ వంటి ముఖ్యమైన పోషకాలు ఉండటంతోపాటు, ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. అందుకే వారానికి కొన్ని సార్లు ఎడమామెను ఆహారంలో భాగంగా చేర్చుకోవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఎడమామెలో అధిక నాణ్యత కలిగిన ప్రోటీన్ ఉంటుంది. శరీరానికి అవసరమైన తొమ్మిది ఎసెన్షియల్ అమైనో ఆమ్లాలు ఇందులో లభిస్తాయి. ముఖ్యంగా శాకాహారం తీసుకునే వారికి మొక్కల ఆధారిత ప్రోటీన్‌కు ఇది మంచి వనరుగా ఉపయోగపడుతుంది. రోజువారీ ఆహారంలో తగినంత ప్రోటీన్ అందుకోవడానికి ఎడమామెను స్నాక్‌గా లేదా భోజనంలో భాగంగా తీసుకోవచ్చు.ఫైబర్ అధికం..ఎడమామెలో ఫైబర్ కూడా సమృద్ధిగా ఉంటుంది. ఒక కప్పు ఎడమామెలో సుమారు 8–9 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి, పేగుల్లోని మంచి బ్యాక్టీరియా సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడుతుంది. అలాగే మలబద్ధకం సమస్యను తగ్గించడంలో కూడా ఫైబర్ ఉపయోగపడుతుంది.ఎడమామెకు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. అందువల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా ఉండేందుకు ఇది సహాయపడుతుంది. ముఖ్యంగా పీసీవోఎస్ (గ్రాజూరా) లేదా మధుమేహం ఉన్నవారు తమ ఆహారంలో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగిన ఆహారాలను చేర్చుకోవడం ద్వారా రక్తంలో చక్కెర నియంత్రణకు తోడ్పడుతుంది.ఆకలి నియంత్రణకు..ఎడమామె కడుపు నిండిన భావనను ఎక్కువసేపు కొనసాగించడంలో కూడా సహాయపడుతుంది. దీంతో తరచూ ఆకలి వేయడం లేదా అనారోగ్యకరమైన స్నాక్స్ తినాలనే కోరికను తగ్గించుకోవచ్చు. బరువు నియంత్రించుకోవాలనుకునేవారు చిప్స్, ఇతర జంక్ ఫుడ్స్‌కు బదులుగా ఎడమామెను ఆరోగ్యకరమైన స్నాక్‌గా ఎంచుకోవచ్చు. వ్యాయామం చేసే వారికి కూడా ఎడమామె మంచి స్నాక్‌గా ఉపయోగపడుతుంది. ప్రోటీన్, ఫైబర్ అందించే కారణంగా వర్కౌట్ తర్వాత లేదా రెండు భోజనాల మధ్యలో తీసుకోవచ్చు. వారానికి రెండు నుంచి మూడు సార్లు ఎడమామెను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన, పోషక విలువలు కలిగిన స్నాక్‌ను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

# రోజూ ఎవరైనా సరే ఆహారంలో ఎంత ఫైబర్ తీసుకోవాలి.. ఇది ఎక్కువైతే ఏం జరుగుతుంది..?



ఆరోగ్యకరమైన ఆహారంలో ఫైబర్‌ది కీలక పాత్ర. అయితే రోజువారీ ఆహారంలో చాలామంది శరీరానికి అవసరమైనంత ఫైబర్‌ను తీసుకోవడం లేదు. సాధారణంగా పెద్దలు రోజుకు సుమారు 25 నుంచి 38 గ్రాముల ఫైబర్ తీసుకోవాల్సి ఉండగా, చాలామంది సగటున 15 గ్రాముల వరకు మాత్రమే తీసుకుంటున్నట్లు నిపుణులు చెబుతున్నారు. అయితే ఫైబర్‌ను ఒక్కసారిగా ఎక్కువగా తీసుకోవడం కూడా ఆరోగ్యానికి ఇబ్బందులు కలిగిస్తుంది. ఫైబర్ తీసుకోవడం పెంచే సమయంలో ముందుగా గుర్తుంచుకోవాల్సిన విషయం.. జీర్ణవ్యవస్థలో అసౌకర్యం లేదా లక్షణాలు మరింత తీవ్రమవుతున్నా అదే విధంగా ఫైబర్ తీసుకోవడం కొనసాగించకూడదు. లక్షణాలు పెరుగుతున్నాయంటే శరీరానికి ఆ విధానం సరిపోవడం లేదని అర్థం. అలాంటి సమయంలో ఆహారంలో మార్పులు చేయడం అవసరం.ఎంత ఫైబర్ కావాలి..అలాగే ఫైబర్‌లోని రకాలను కూడా తెలుసుకోవాలి. కరిగే ఫైబర్‌ను ఓట్స్, సెలీయం వంటి ఆహారాల్లో పొందవచ్చు. ఇది నీటిలో కరిగి జీర్ణక్రియను నెమ్మదిస్తుంది. విరేచనాలు, కొలెస్ట్రాల్ నియంత్రణకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది. మరోవైపు గోధుమ తవుడు, కూరగాయల తొక్కలు వంటి వాటిలో లభించే కరగని ఫైబర్ మలానికి పరిమాణాన్ని పెంచుతుంది. ఇది మలబద్ధకం ఉన్నవారికి ఉపయోగపడుతుంది. కాబట్టి తమ సమస్యకు సరిపోని ఫైబర్ రకాన్ని ఎక్కువగా తీసుకుంటే ప్రయోజనం కంటే అసౌకర్యమే కలుగుతుంది. రోజంతా తీసుకోవాల్సిన ఫైబర్ మొత్తాన్ని ఒకేసారి తినడం కూడా మంచిది కాదు. ఒకేసారి అధిక మొత్తంలో ఫైబర్ తీసుకుంటే జీర్ణవ్యవస్థపై భారం పడుతుంది. అందువల్ల రోజువారీ ఫైబర్‌ను చిన్న మొత్తాల్లో విభజించి, రోజంతా తీసుకోవడం మంచిది. తక్కువ ఫైబర్ తీసుకునే అలవాటు నుంచి ఒక్కసారిగా అధిక ఫైబర్ ఆహారానికి మారడం కూడా సమస్యలకు దారితీస్తుంది. పేగుల్లోని బ్యాక్టీరియా కొత్త ఆహారానికి అలవాటు పడేందుకు కొంత సమయం అవసరం. అందువల్ల ఫైబర్‌ను క్రమంగా పెంచాలి. కొన్ని రోజుల వ్యవధిలో సుమారు 5 గ్రాముల చొప్పున పెంచడం ద్వారా శరీరాన్ని నెమ్మదిగా అలవాటు చేయవచ్చు. ఉదాహరణకు రోజుకు 15 గ్రాముల నుంచి ఒక్కసారిగా 35 గ్రాములకు పెంచకుండా, దశలవారీగా పెంచడం మంచిది.
నీళ్లను తాగడం ముఖ్యం..ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకునేటప్పుడు తగినంత నీరు తాగడం కూడా చాలా ముఖ్యం. ఫైబర్ పేగుల్లో నీటిని గ్రహిస్తుంది. తగినంత ద్రవాలు తీసుకోకపోతే ఫైబర్ వల్ల ప్రయోజనం కలగకుండా ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఫైబర్‌ను పెంచుకోవడానికి పండ్ల రసాలకు బదులుగా యాపిల్, పియర్ వంటి పండ్లను నేరుగా తినవచ్చు. తెల్ల బియ్యం, వైట్ బ్రెడ్, సాధారణ పాస్తాకు బదులుగా సంపూర్ణ ధాన్యాలతో తయారైన ఆహారాన్ని ఎంచుకోవచ్చు. చిరుతిండిగా జంక్‌ఫుడ్‌కు బదులుగా కూరగాయలను తీసుకోవడం, భోజనంలో పప్పులు, బీన్స్ వంటి వాటిని చేర్చడం ద్వారా ఫైబర్‌ను పెంచుకోవచ్చు. తృణధాన్యాలు, స్మూతీలు లేదా సలాడ్లలో చియా గింజలను కూడా చేర్చవచ్చు. అయితే ఫైబర్ పెంచే సమయంలో తగినంత నీరు తీసుకోవడం కూడా తప్పనిసరి అని నిపుణులు తెలియజేస్తున్నారు.

# రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ అవార్డు గ్రహీత ముచ్చర్ల శ్రీనివాస్ ను అభినందించినమంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**నల్లగొండ,ఆగస్టు 23( నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన అవార్డు కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో ప్రతిభ కనబరిచి అవార్డు అందుకున్న ఉమ్మడి నల్గొండ జిల్లా ద హన్స్ ఇండియా ఫోటోగ్రాఫర్ ముచ్చర్ల శ్రీనివాస్‌ను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి, అవార్డు అందుకున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఫోటోగ్రఫీ రంగంలో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొని ముచ్చర్ల శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న బీజేపీ నేత తల్లోజు ఆచారి



**కల్వకుర్తి, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలో ఆదివారం మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు, బీజేపీ నేత తల్లోజు ఆచారి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి కేశవ దాసు--అపర్ణ అశోక్ దంపతుల కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరైన ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. దంపతులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.అనంతరం కల్వకుర్తి పట్టణానికి చెందిన యువకులు తరుణ్, అరవింద్, అశ్వంత్ నూతనంగా ఏర్పాటు చేసిన 'మన వేడుక' ఈవెంట్ మేనేజ్‌మెంట్ కార్యాలయాన్ని తల్లోజు ఆచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా యువ ఉద్యములు తమ వ్యాపారాన్ని విజయవంతంగా అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షిస్తూ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా ఇందిరానగర్ కాలనీకి చెందిన మత్తమల్ల సుభాష్ నూతనంగా కొనుగోలు చేసిన రెండు అంబులెన్స్‌లను తల్లోజు ఆచారి పూజా కార్యక్రమాలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అంబులెన్స్ సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచుతూ సేవాభావంతో నిర్వహించాలని సూచించారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో తల్లోజు ఆచారి వెంట స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎలిగేడులో జ్ఞాన సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



**- యువతకు విద్య, నైపుణ్యాలు, సాధికారతే నిజమైన అభివృద్ధి: దాసరి ఉష**

**ఎలిగేడు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఈనెల 30న గంగాధరలో నిర్వహించనున్న 'జ్ఞాన సమ్మేళనం'కు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఎలిగేడు మండల కేంద్రంలో మండల స్వేరోస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన దాసరి ఉష పోస్టర్‌ను ఆవిష్కరించి, జ్ఞాన సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ.. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు, మౌలిక వసతుల కల్పన మాత్రమే కాదని అన్నారు. భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, సాధికారత కల్పించడమే నిజమైన అభివృద్ధికి అర్థమని పేర్కొన్నారు. నేటి జెన్–జీ యువత తమ భవిష్యత్తు కోసం ప్రశ్నిస్తూ, తమ హక్కుల కోసం పోరాడుతోందని, వారికి సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యతో పాటు ఫిట్‌నెస్, డిజిటల్ ప్రెజెన్స్, నైపుణ్యాభివృద్ధి, వ్యాపారం, ఉపాధి వంటి వివిధ రంగాల్లో యువతను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. అభివృద్ధి అనేది కేవలం నగరాలకే పరిమితం కాకూడదని, గ్రామీణ ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు కల్పిస్తూ వారి భవిష్యత్తును బలోపేతం చేయాలని అన్నారు.యువతలో జ్ఞానం, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'హలో స్వేరో.. ఛలో గంగాధర జ్ఞాన సమ్మేళనం'ను విజయవంతం చేయాలని దాసరి ఉష కోరారు.ఈ కార్యక్రమంలో ఓం ప్రకాష్, శ్రీకాంత్, అక్షయ్, శంకరయ్య, రమేష్, నరేష్, ప్రవీణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలి

**- ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి**
**- ఎలిగేడు ఆటో యూనియన్ నాయకుల పిలుపు**

**ఎలిగేడు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ఆటోల బంద్‌ను ఎలిగేడులో విజయవంతం చేయాలని ఎలిగేడు ఆటో యూనియన్ అధ్యక్షుడు కవ్వంపల్లి శ్రీనివాస్ (బంగ్లా), ప్రధాన కార్యదర్శి కట్ల ప్రతాప్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు నెలకు రూ.1,000 చొప్పున ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని అన్నారు. అదేవిధంగా ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ఆటో డ్రైవర్లకు 250 గజాల ఇంటి స్థలం అందిస్తామని ఇచ్చిన హామీలను కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు.మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల ఆదాయంపై తీవ్ర ప్రభావం పడిందని, తమ జీవనోపాధి దెబ్బతిని అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెలో ఎలిగేడు ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని కవ్వంపల్లి శ్రీనివాస్,
కట్ల ప్రతాప్ కోరారు.

# నడక, శ్వాస.. కలగలిసి...



'తాయ్ చి' అనేది చైనీస్ యుద్ధ కళ. దీని సూత్రాల ఆధారంగా చేసే మైండ్‌ఫుల్ నడక 'తాయ్ చి వాకింగ్'. చాలా నెమ్మదిగా, ప్రతీ అడుగునూ గమనిస్తూ నడవడం దీని ప్రత్యేకత. ఇందులో శ్వాస, సమతుల్యత, శరీరంపై పూర్తి స్పృహ ముఖ్యం. ఎక్కడైనా, ఎవరైనా వయసుతో సంబంధం లేకుండా దీనిని సాధన చేయొచ్చు. సరళంగా ఉంటూనే ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఇస్తోందని, ఒత్తిడితో బాధపడేవారు దీనికి ఆకర్షితులవుతున్నారు. సాధన చేస్తున్నారు.ఒత్తిడికి గురైనప్పుడు కాసేపు వాకింగ్ చేయాలని పెద్దలు సూచిస్తుంటారు. ఇంటి చుట్టూ చిన్న నడక కావొచ్చు, దగ్గర్లోని పార్కుకు వెళ్లి ప్రశాంతంగా వాకింగ్ చేయడం కావొచ్చు. మొత్తమ్మీద నడక వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయని తాయ్ చి ట్రెండ్ చాటుతోంది. "రోజంతా స్క్రీన్ ముందే ఉండటం వల్ల విపరీతమైన మెడ, నడుము నొప్పులుండేవి. దీంతో తాయ్ చి నడక ట్రై చేశా. రోజూ సాయంత్రం 15–20 నిమిషాలు శ్వాసపై దృష్టిపెడుతూ చేసే ఈ నడక నా మైండ్‌ను రిఫ్రెష్ చేస్తోంది. రాత్రివేళల్లో నిద్ర కూడా బాగా పడుతోంది" అంటూ ఐటీ ఉద్యోగులు తమ అనుభవాలను సోషల్‌మీడియాలో పంచుకుంటున్నారు.

సోమవారం, ఆగస్టు 24, 2026
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644



## ఘనంగా శ్రీ గడి మైసమ్మ తల్లి బోనాలు



మేడ్చల్ : మేడ్చల్ పట్టణంలోని శ్రీ గడి మైసమ్మ తల్లి దేవాల యంలో శ్రావణ మాసబోనాలను అత్యంత భక్తి శ్రద్దల మధ్య ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం నిర్వహించు శ్రీ గడి మైసమ్మ తల్లి శ్రావణ మాస భవనాలను ఈ సంవత్సరం సైతం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మేడ్చల్ తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఇందుకోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కిలోమీటర్ మేరకు విద్యుత్ దీపాలను అలంకరించారు. గడి మైసమ్మ తల్లి అమ్మవారిని అలంకరించి భక్తు లకు దర్శనం కల్పించారు. తెల్లవారుజామున నుండే భక్తులు గడి మైసమ్మ దేవాలయం చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులతో గడి మైసమ్మ దేవాలయం కిటకిట లాడింది.

## చిన్నారుల్లో వచ్చే లుకేమియాను ముందే గుర్తించవచ్చా.. లక్షణాలు ఎలా ఉంటాయి..?



పిల్లల్లో వచ్చే క్యాన్సర్లలో లుకేమియా అత్యంత సాధారణమైనదిగా చెప్పవచ్చు. అయితే భయపడాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా చిన్నారుల్లో కనిపించే అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియా (ఏఎల్ఎల్)ను ప్రారంభ దశలో గుర్తించి, వైద్యుల సూచనల మేరకు చికిత్సను పూర్తిగా కొనసాగిస్తే నయం చేసే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి. వ్యాధిని ఆలస్యంగా గుర్తించడం, చికిత్సను మధ్యలోనే ఆపేయడం వంటి కారణాల వల్లే ఫలితాల్లో తేడాలు కనిపిస్తున్నాయి. అందుకే తల్లిదండ్రులు లక్షణాలపై అవగాహన కలిగి ఉండటం, అనుమానం వచ్చినప్పుడు ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం చాలా ముఖ్యం. ఇతర క్యాన్సర్లతో పోలిస్తే లుకేమియా కొంత భిన్నంగా ఉంటుంది. సాధారణంగా కొన్ని క్యాన్సర్లు శరీరంలోని ఒక ప్రాంతంలో కణితిగా ఏర్పడి క్రమంగా పెరుగుతాయి. కానీ లుకేమియా ఎముక మజ్జలో ప్రారంభమవుతుంది. ఇక్కడే శరీరానికి అవసరమైన రక్తకణాలు తయారవుతాయి. అసాధారణమైన తెల్ల రక్తకణాలు వేగంగా పెరగడంతో ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్లు, ఆరోగ్యకరమైన తెల్ల రక్తకణాల తయారీకి ఆటంకం ఏర్పడుతుంది. ఫలితంగా చిన్నారుల్లో రక్తహీనత, ఇన్ఫెక్షన్లు, రక్తస్రావం వంటి సమస్యలు కనిపిస్తాయి.కీమోథెరపీకి మంచి స్పందన..లుకేమియా వేగంగా విభజించే కణాలతో సంబంధం ఉన్న వ్యాధి కావడం వల్ల కీమోథెరపీకి మంచి స్పందన కనిపిస్తుంది. చికిత్స ప్రారంభించిన తర్వాత చాలా మంది చిన్నారుల్లో నాలుగు నుంచి ఆరు వారాల్లోనే రిమిషన్ దశకు చేరుకునే అవకాశం ఉంటుంది. అంటే పరీక్షల్లో లుకేమియా కణాలు గుర్తించలేని స్థితికి చేరుకోవడం. దేశంలో దాదాపు 2,700 మంది ఏఎల్ఎల్ చిన్నారులపై నిర్వహించిన ఒక విస్తృత అధ్యయనంలో, ప్రారంభ దశలో స్టాండర్డ్ రిస్క్‌గా గుర్తించిన పిల్లల్లో నాలుగేళ్ల మొత్తం జీవించే అవకాశాలు సుమారు 88 శాతంగా ఉన్నట్లు తేలింది. వ్యాధిని సకాలంలో గుర్తించి, సరైన చికిత్స అందించినప్పుడు మంచి ఫలితాలు సాధించవచ్చని ఇది సూచిస్తోంది. లుకేమియాను ఆలస్యంగా గుర్తిస్తే వ్యాధి ఎముక మజ్జలో మరింతగా విస్తరించడంతోపాటు రక్తప్రవాహం ద్వారా శరీరంలోని ఇతర ప్రాంతాలకు చేరే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో కేంద్ర నాడీ వ్యవస్థ లేదా ఇతర అవయవాలపైనా ప్రభావం చూపిస్తుంది. దీంతో చికిత్సకు స్పందించడం కష్టమవుతుంది, తిరిగి వ్యాధి వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ఆసుపత్రికి చేరుకునే సమయానికి కొంతమంది పిల్లల్లో తీవ్రమైన రక్తహీనత, ప్లేట్‌లెట్ల కొరత, ఇన్ఫెక్షన్లు వంటి సమస్యలు ఉండటంతో చికిత్స ప్రారంభించడం కూడా సవాలుగా మారుతుంది.
ఆలస్యంగా గుర్తిస్తున్నారు..భారత్‌లో పిల్లల క్యాన్సర్ విషయంలో ఆలస్యంగా గుర్తించడం ఒక ముఖ్యమైన సమస్యగా ఉంది. దేశంలో ప్రతి ఏడాది 75వేల మందికి పైగా చిన్నారులకు క్యాన్సర్ వస్తున్నట్లు అంచనాలు ఉన్నాయి. అయితే వీరిలో దాదాపు సగం మందికి వ్యాధి నిర్ధారణే జరగడం లేదని ప్రజారోగ్య అంచనాలు తెలియజేస్తున్నాయి. అవగాహన లేకపోవడం, పెద్ద నగరాల వెలుపల పిల్లల క్యాన్సర్ చికిత్స అందుబాటులో లేకపోవడం, క్యాన్సర్ లక్షణాలను సాధారణ చిన్ననాటి అనారోగ్యాలుగా భావించడం ఇందుకు కారణాలుగా ఉన్నాయి. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత కూడా కొంతమంది పిల్లలు చికిత్సను పూర్తిగా కొనసాగించలేకపోతున్నారు. చికిత్స ఖర్చులు, ఎక్కువ కాలం పాటు ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం, ఇంటికి దూరంగా చికిత్స పొందడం వంటి కారణాలతో చికిత్స మధ్యలో ఆగిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. లుకేమియా ప్రారంభ దశలో కనిపించే లక్షణాలు చాలాసార్లు సాధారణ అనారోగ్యాల మాదిరిగానే ఉంటాయి. పిల్లల్లో నిరంతర అలసట, సాధారణం కంటే ఎక్కువగా పాలిపోయినట్లు కనిపించడం, చిన్న దెబ్బకే ఎక్కువగా గాయాలు లేదా నీలిమచ్చలు రావడం, చర్మంపై తగ్గకుండా ఉండే చిన్న ఎరుపు లేదా ఊదా రంగు మచ్చలు కనిపించడం వంటి లక్షణాలను గమనించాలి. తరచూ జ్వరం రావడం, ఇన్ఫెక్షన్లు పదేపదే రావడం కూడా పరిశీలించాల్సిన లక్షణాలే. లక్షణాలేంటి..ఎముకలు లేదా కీళ్లలో నొప్పి, నొప్పి కారణంగా పిల్లలు సరిగ్గా నడవలేకపోవడం లేదా నడవడానికి నిరాకరించడం, మెడ, చంకలు వంటి ప్రాంతాల్లో లింఫ్ నోడ్స్ వాపు, పొట్ట అసాధారణంగా ఉబ్బినట్లు లేదా గట్టిగా అనిపించడం కూడా నిర్లక్ష్యం చేయకూడదు. కాలేయం లేదా ప్లీహం పెరగడం వల్ల పొట్ట ఉబ్బినట్లు కనిపిస్తుంది. కారణం తెలియకుండా బరువు తగ్గడం లేదా అకస్మాత్తుగా ఆకలి తగ్గడం కూడా గమనించాల్సిన అంశాలే. అయితే ఈ లక్షణాల్లో ఒక్కటి కనిపించినంత మాత్రాన లుకేమియా ఉందని అర్థం కాదు. చాలా సందర్భాల్లో ఇలాంటి లక్షణాలకు సాధారణ కారణాలే ఉంటాయి. కానీ ఒక లక్షణం రెండు వారాలకు మించి కొనసాగితే, లేదా ఒకేసారి అనేక లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించడం మంచిది. సాధారణంగా పూర్తి రక్తపరీక్ష (ఫుల్ బ్లడ్ కౌంట్) వ్యాధి గురించి ప్రాథమికంగా తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఈ పరీక్ష సులభంగా, తక్కువ ఖర్చుతో చేయించుకోవచ్చు. ఇందుకోసం తప్పనిసరిగా పెద్ద నగరంలోని ప్రత్యేక ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం లేదు, సమీపంలోని క్లినిక్ లేదా ఆసుపత్రిలో కూడా ప్రారంభ పరీక్ష చేయించుకోవచ్చు. చిన్నారుల్లో ఏఎల్ఎల్ చికిత్స సాధారణంగా రెండు నుంచి మూడు సంవత్సరాల పాటు వివిధ దశల్లో కొనసాగుతుంది. మొదటి దశలో ఇంటెన్సివ్ ఇండక్షన్ చికిత్స ద్వారా రిమిషన్ సాధించడమే లక్ష్యంగా ఉంటుంది. ఆ తర్వాత శరీరంలో మిగిలి ఉండే వ్యాధి కణాలను తొలగించేందుకు కన్సాలిడేషన్ దశ కొనసాగుతుంది. అనంతరం రిమిషన్‌ను కొనసాగించేందుకు తక్కువ తీవ్రత కలిగిన మెయింటెనెన్స్ చికిత్స ఉంటుంది. చికిత్స సుదీర్ఘంగా ఉన్నప్పటికీ, చాలా మంది పిల్లలు చికిత్సతో పాటు చదువు, స్నేహాలు, సాధారణ బాల్య జీవితాన్ని కొనసాగించే అవకాశం ఉంటుంది.ప్రారంభంలోనే గుర్తిస్తే..వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే పిల్లలు చికిత్సను మెరుగ్గా తట్టుకునే అవకాశం ఉంటుంది. వ్యాధి విస్తృతంగా వ్యాపించకముందే గుర్తించడం వల్ల దీర్ఘకాలిక ఫలితాలు కూడా మెరుగ్గా ఉంటాయి. ప్రతి చిన్నారి లుకేమియాకు ఒకే రకమైన చికిత్స ఉండదు. వ్యాధి స్వభావం, రిస్క్ స్థాయి, ఇతర వైద్య వివరాల ఆధారంగా చికిత్సను వైద్యులు నిర్ణయిస్తారు. సరైన రిస్క్ వర్గీకరణ, ముందస్తు నిర్ధారణ, చికిత్సను పూర్తిగా కొనసాగించడం వల్ల దేశంలోని అనేక చికిత్సా కేంద్రాల్లో పిల్లల జీవించే అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ప్రతి జ్వరం, ప్రతి గాయం లేదా ప్రతి నీలిమచ్చను చూసి తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

## మీడియా అకాడమీ సేవలు అభినందనీయం

**– జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణకు చేస్తున్న కృషిపై ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రశంసలు**





హైదరాబాద్: జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి నైపుణ్యాల పెంపు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు తెలంగాణ మీడియా అకాడమీ చేస్తున్న కృషి అభినందనీయమని ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు ప్రశంసించారు. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులతో ఏర్పడిన ఫెడరేషన్ బృందం శనివారం మధ్యాహ్నం తెలంగాణ మీడియా అకాడమీ భవనాన్ని సందర్శించింది.ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి ప్రతినిధి బృందానికి అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు ప్రతినిధులకు స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు అందిస్తున్న అక్రిడిటేషన్ సౌకర్యాలు, విధి నిర్వహణలో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు అందిస్తున్న రూ.1 లక్ష ఆర్థిక సహాయం, వారి పిల్లలకు ట్యూషన్ ఫీజు సహాయం తదితర సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రతినిధులకు వివరించారు.డెస్క్ జర్నలిస్టులకు సైతం అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తుండటం పట్ల ఫెడరేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 23 వేల మందికి పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.

**– జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వినతిపత్రం**

రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీలు, అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఫెడరేషన్ ప్రతినిధులు మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సమస్యలను పరిశీలించి సంబంధిత ఎంపీలు, రాజకీయ పార్టీల దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

**– శిక్షణకు ప్రాధాన్యం**

జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు, వర్క్‌షాప్‌లు, అవగాహనా కార్యక్రమాల గురించి అకాడమీ అధికారులు వివరించారు. శిక్షణలో పాల్గొనే జర్నలిస్టులకు ఉపయోగపడేలా అకాడమీ ప్రచురిస్తున్న మోనోగ్రాఫ్‌లు, పుస్తకాలను కూడా ప్రతినిధులు పరిశీలించారు.

**– ఆధునిక సౌకర్యాలతో మీడియా అకాడమీ**

మీడియా అకాడమీ కోసం నిర్మించిన ఐదు అంతస్తుల భవనాన్ని ప్రతినిధి బృందం సందర్శించింది. శిక్షణ తరగతులు, గ్రంథాలయం, కంప్యూటర్ సౌకర్యాలు, సమావేశ మందిరం, 250 మంది సామర్థ్యంతో కూడిన సెంట్రల్ ఏసీ ఆడిటోరియం తదితర సౌకర్యాలను పరిశీలించారు. జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణ కోసం ఇంతటి సమగ్ర మౌలిక వసతులతో అకాడమీ పనిచేయడం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

కొత్తగా ఏర్పడిన ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ కేవలం మరో సంస్థగా కాకుండా దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తి ప్రమాణాలు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు బలమైన వేదికగా ఎదగాలని ప్రతినిధులు ఆకాంక్షించారు. జర్నలిస్టుల ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఫెడరేషన్ మరింత క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు.తెలంగాణ మీడియా అకాడమీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని, ముఖ్యంగా జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణ రంగాల్లో అకాడమీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఫెడరేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ అధ్యక్షుడు గౌతమ్ పహారి, డా. స్నేహాశిస్ సూర్, జనరల్ సెక్రటరీ సౌరభ్ దుగ్గల్, సెక్రటరీ జనరల్ రాజేష్ థల్, ట్రెజరర్ నీరజ్ఠాకూర్, సభ్యులు అనిల్ సింగ్, రమేష్ హండా, వివేక్ ముఖర్జీ, నీలేష్ కాంతాహా, హరీష్ పగిడే, సంజయ్ మహతా, సోనాలి యాదవ్, దీపక్ మహేశ్వరీ, ఉదిత్ తండ్, ఉమాలీ తండ్, లక్ష్మణ్ ఫండ్, యాష్ వర్ధన్ సింగ్, రచనా జోషి తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, కార్యదర్శి రమేష్, ఏ. రాజేష్, మీడియా అకాడమీ మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, ఓఎస్డీ ఎం.కె. రహమాన్ తదితరులు హాజరయ్యారు.

## బిర్యానీ పాత్రలో శరీర భాగాలు?

**– 350 సీసీటీవీలతో వీడిన మిస్టరీ**
**– చెన్నైలో మహిళను హత్య చేసి ముక్కలుగా నరికిన దంపతులు.. ఆనవాళ్లు చెరిపేందుకు దారుణ యత్నం**

చెన్నై: తమిళనాడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో గుర్తుతెలియని మహిళ శరీర భాగాలతో కూడిన సూట్‌కేస్ కలకలం రేపిన ఘటనలో పోలీసులు సంచలన విషయాలను వెలుగులోకి తీసుకొచ్చారు. చెన్నైలో ఓ మహిళను హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా నరికి, కొంత భాగాన్ని సూ ట్‌కేస్‌లో పెట్టి రైలులో వదిలేసినట్లు పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తులో సుమారు 350 సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితుల ఆచూకీని పోలీసులు గుర్తించినట్లు సమాచారం.ఆగస్టు 5న ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా రైల్వే స్టేషన్‌కు చేరుకున్న తమిళనాడు ఎక్స్‌ప్రెస్ బోగీలోని ఎరుపు రంగు సూట్‌కేస్ నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. సూట్‌కేస్‌ను తెరిచి చూడగా నరికిన మానవ శరీర భాగాలు కనిపించాయి. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.
చెన్నై నుంచి సూట్‌కేస్ తరలింపుసూట్‌కేస్‌ను చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లోనే రైలులో ఎక్కించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దీంతో పోలీసులు చెన్నై సెంట్రల్, పరిసర ప్రాంతాల్లోని సుమారు 350 సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫుటేజీల్లో ఓ మహిళ, ఓ పురుషుడు ఎరుపు రంగు సూట్‌కేస్‌తో స్టేషన్‌లోకి వచ్చి దానిని రైలులో ఉంచినట్లు గుర్తించారు. అనంతరం వారు చెన్నై పార్క్ స్టేషన్‌కు వెళ్లి అక్కడి నుంచి లోకల్ రైలు



లో గూడువాంచేరి వైపు ప్రయాణించినట్లు పోలీసులు గుర్తించారు.

**– ఆటో ఆధారంగా ఇంటికి చేరుకున్న పోలీసులు**

గూడువాంచేరి పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు నిందితులు ప్రయాణించిన ఆటోను గుర్తించారు. ఆ ఆటో వెళ్లిన మార్గాన్ని అనుసరిస్తూ మసీదు వీధిలోని ఓ అద్దె ఇంటికి చేరుకున్నారు.ఇంట్లో తనిఖీలు నిర్వహించగా రక్తపు మరకలు, హత్య జరిగినట్లు అనుమానించేందుకు బలమైన ఆధారాలు లభించినట్లు పోలీసులు తెలిపారు. హత్య అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా చేసి కొన్ని భాగాలను సూట్‌కేస్‌లో తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం.

**– బిర్యానీ పాత్రలో శరీర భాగాలు?**

పోలీసుల దర్యాప్తులో మరిన్ని దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. హత్యకు సంబంధించిన ఆనవాళ్లను చెరిపివేసేందుకు మృతదేహంలోని కొన్ని భాగాలను మైదా పిండి, కూరగాయలతో కలిపి పెద్ద పాత్రలో ఉడికించినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. మృతురాలి తల కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు.

**– మృతురాలు ఒడిశాకు చెందిన నిషాగా గుర్తింపు**

మృతురాలిని ఒడిశాకు చెందిన హయత్ నిషాగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. భర్తతో విడిపోయిన ఆమె తాంబరంలోని ఓ ఎక్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిసింది. ఆమె కుమారుడు ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.నిషా, మాణిక్ ఉత్తిన్--లస్కర్ దంపతులతో కలిసి నివసిస్తున్నట్లు సమాచారం. మాణిక్ ఉత్తిన్ తనకు తమ్ముడిగా నిషా చుట్టుపక్కల వారికి పరిచయం చేసినట్లు తెలుస్తోంది.

**– హత్యకు కారణమేంటి?**

నిషాను ఎందుకు హత్య చేశారు? హత్య వెనుక ఆర్థిక లావాదేవీలు ఉన్నాయా? డబ్బు, నగల కోసమే ఈ దారుణానికి పాల్పడ్డారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల విచారణతో హత్యకు అసలు కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## ప్రసవానంతరం మహిళలకు వచ్చే థైరాయిడ్ సమస్యలకు కారణాలేంటి..



ప్రసవం తర్వాత మహిళల్లో శరీరంలో అనేక హార్మోన్ల, రోగనిరోధక వ్యవస్థ మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ సమయంలో థైరాయిడ్ పనితీరులో కూడా మార్పులు వస్తాయి. అయితే ప్రసవం తర్వాత థైరాయిడ్ సమస్య కనిపించిందంటే అది జీవితాంతం కొనసాగుతుందని భావించాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఇది తాత్కాలికంగా ఉండే పోస్ట్‌పార్టమ్ థైరాయిడిటిస్ అవుతుంది. రక్తపరీక్షల్లో ఈ సమస్య హషిమోటోస్ వ్యాధిని పోలి కనిపించే అవకాశం ఉండటంతో కొందరు మహిళలకు శాశ్వత థైరాయిడ్ సమస్యగా పొరపాటుగా నిర్ధారణ జరిగే అవకాశం ఉంటుంది. గర్భధారణ సమయంలో శిశువును రక్షించేందుకు మహిళ శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ సహజంగానే కొంత తక్కువగా చురుకుగా ఉంటుంది. ప్రసవం తర్వాత అది మళ్లీ సాధారణ స్థాయికి చురుకుగా మారే సమయంలో కొంతమంది మహిళల్లో రోగనిరోధక ప్రతిస్పందన అధికంగా మారి థైరాయిడ్ గ్రంథిలో వాపులకు దారితీస్తుంది. దాదాపు ప్రతి పది మంది మహిళల్లో ఒకరికి ఈ విధమైన పోస్ట్‌పార్టమ్ థైరాయిడిటిస్ వచ్చే అవకాశం ఉందని నిపుణుల వివరణలో పేర్కొన్నారు.
అందరికీ ఒకేలా ఉండవు..ప్రసవం తర్వాత థైరాయిడ్ సమస్యకు సంబంధించిన లక్షణాలు ఒకే విధంగా ఉండవు. సాధారణంగా ఇది వివిధ దశల్లో కనిపిస్తుంది. మొదటి దశలో థైరాయిడ్ హార్మోన్లు అధికంగా విడుదల అవుతాయి. ఈ సమయంలో మహిళలు అలసటగా ఉన్నప్పటికీ, అదే సమయంలో అసహనంగా లేదా అధిక ఉత్సాహంతో ఉన్నట్లుగా అనిపిస్తుంది. నిద్ర సరిగా పట్టకపోవడం, ఒత్తిడిగా అనిపించడం, జుట్టు రాలడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. అయితే కొత్తగా తల్లైన మహిళల్లో సాధారణంగా కనిపించే అలసట లేదా ఒత్తిడిగానే వీటిని భావించే అవకాశం ఉంటుంది. రెండో దశలో థైరాయిడ్ హార్మోన్ల స్థాయిలు తగ్గుతాయి. అప్పుడు తీవ్రమైన అలసట, ఎప్పుడూ శక్తి లేనట్లుగా అనిపించడం, భావోద్వేగంగా నీరసంగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి ప్రసవానంతర డిప్రెషన్ లక్షణాలను పోలి ఉండటంతో అసలు కారణాన్ని గుర్తించడం కొన్నిసార్లు కష్టమవుతుంది. అందుకే ప్రసవం తర్వాత ఇలాంటి లక్షణాలు కొనసాగితే వాటిని కేవలం ప్రసవం వల్ల వచ్చిన అలసటగా భావించకుండా వైద్యుల సలహాతో పరీక్షలు చేయించుకోవడం అవసరం.టీపీవో యాంటీ బాడీలు..అయితే ప్రతి మహిళలో ఈ సమస్య జీవితాంతం కొనసాగదు. చాలా మందిలో మూడో దశలో థైరాయిడ్ పనితీరు క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటుంది. అలాంటి సందర్భాల్లో జీవితాంతం థైరాయిడ్ మందులు తీసుకోవాల్సిన అవసరం ఉండదు. కానీ కొంతమంది మహిళల్లో మాత్రం థైరాయిడ్ సమస్య శాశ్వతంగా మారే అవకాశం ఉంటుంది. అందుకే ప్రసవం తర్వాత థైరాయిడ్ సమస్యను గుర్తించిన వెంటనే అది జీవితాంతం ఉంటుందని నిర్ణయించకుండా, నిరంతర పర్యవేక్షణతో పరిస్థితిని అంచనా వేయడం ముఖ్యం. థైరాయిడ్ పెరోక్సిడేజ్ (ట్రూపా) యాంటీబాడీల స్థాయి ఈ విషయంలో ఒక ముఖ్యమైన సూచికగా ఉంటుంది. గర్భధారణ ప్రారంభ దశలోనే ట్రూపా యాంటీబాడీలను పరీక్షించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ట్రూపా యాంటీబాడీలు అధికంగా ఉన్న మహిళల్లో భవిష్యత్తులో శాశ్వత థైరాయిడ్ సమస్య ఏర్పడే అవకాశం సుమారు ముగ్గురిలో ఒకరికి ఉంటుంది. ప్రసవానంతర కాలంలో శరీరంలో హార్మోన్లు, రోగనిరోధక వ్యవస్థలో పెద్ద మార్పులు చోటుచేసుకుంటాయి. అందువల్ల ఈ సమయంలో కనిపించే థైరాయిడ్ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సరైన రక్తప రీక్షలు, వైద్యుల పర్యవేక్షణతో పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ప్రసవం తర్వాత వచ్చిన ప్రతి థైరాయిడ్ సమస్య హషిమోటోస్ వ్యాధి లేదా నిపుణులు తెలియజేస్తున్నారు.

# బంగ్లాను బండకేసి కొట్టిన ఆస్ట్రేలియా! దెబ్బకు 2 రోజుల్లోనే మ్యాచ్ క్లోజ్



డార్విన్ టెస్టులో చారిత్రాత్మక విజయం సాధించి ఆస్ట్రేలియాపై పైచేయి సాధించిన బంగ్లాదేశ్‌కు రెండో టెస్టులో మాత్రం ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. మక్కే వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్, 51 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్ కేవలం 95 పరుగులకే ముగియడంతో మ్యాచ్ రెండో రోజుకే పూర్తయింది.తొలి టెస్టులో చరిత్ర.. రెండో టెస్టులో ఘోర పతనండార్విన్‌లో బంగ్లాదేశ్ అద్భుత ప్రదర్శన చేసింది. ఆస్ట్రేలియాను తక్కువ స్కోరుకే ఆలౌట్ చేసి, తొలి ఇన్నింగ్స్‌లో 426 పరుగుల భారీ స్కోరు సాధించింది. హసన్ మహమూద్ బౌలింగ్‌లో తొమ్మిది వికెట్లు, తంజిద్ హసన్ సెంచరీతో పాటు మెహిదీ హసన్ మిరాజ్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో బంగ్లాదేశ్ ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టు విజయాన్ని నమోదు చేసింది. అయితే ఆ విజయానికి కేవలం ఆరు రోజుల తర్వాతే పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మక్కే టెస్టులో బంగ్లా బ్యాటర్లు ఆస్ట్రేలియా పేసర్లను ఎదుర్కోలేకపోయారు.స్టార్క్ విధ్వంసం.. 64 పరుగులకే ఆలౌట్

మ్యాచ్ తొలి బంతికే మిచెల్ స్టార్క్ వికెట్ తీసి బంగ్లాదేశ్ పతనానికి బాటలు వేశాడు. తన తొలి స్పెల్‌లోనే అద్భుతంగా బౌలింగ్ చేసిన స్టార్క్ 6/12 గణాంకాలతో చెలరేగాడు. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 64 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా తొలి ఆరు స్కోర్లు 0, 0, 9, 0, 5, 0గా ఉండటం పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చెప్పడానికి నిదర్శనం. తొలి ఆరుగురు బ్యాటర్లలో నలుగురు ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు.

షరిఫుల్ పోరాటం వృథా

బంగ్లాదేశ్ బౌలింగ్‌లో షరిఫుల్ ఇస్లాం మాత్రం అద్భుతంగా రాణించాడు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో అతడు 7/48తో చెలరేగాడు. విదేశీ టెస్టులో బంగ్లాదేశ్ బౌలర్ సాధించిన అత్యుత్తమ గణాంకాల్లో ఇది ఒకటిగా నిలిచింది. షోరిఫుల్ ధాటికి ఆస్ట్రేలియా కూడా భారీ స్కోరు చేయలేకపోయింది. కామెరాన్ గ్రీన్ 67, నాథన్ లియాన్ 31 పరుగులతో రాణించడంతో ఆస్ట్రేలియా 210 పరుగులకు ఆలౌటైంది. దీంతో బంగ్లాదేశ్‌పై 146 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే కథ

146 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ మళ్లీ కుప్పకూలింది. షాద్మాన్ ఇస్లాం ఒక్క పరుగుకే అవుట్ కాగా, మొమినుల్ హక్ తొలి బంతికే పెవిలియన్ చేరాడు. తంజిద్ హసన్ 9 పరుగులు, లిట్టన్ దాస్ మరోసారి డకౌట్‌గా వెనుదిరిగారు. నజ్ముల్ హొస్సేన్ శాంతో 31, ముష్ఫికుర్ రహీమ్ కొంత ప్రతిఘటన చూపినా మిగతా బ్యాటర్ల నుంచి సహకారం లభించలేదు. చివరకు బంగ్లాదేశ్ 95 పరుగులకే ఆలౌటైంది.సిరీస్ సమం

మిచెల్ స్టార్క్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు పడగొట్టి ఆస్ట్రేలియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ కూడా బౌలింగ్‌లో మెరిశాడు. దీంతో ఆస్ట్రేలియా రెండో రోజు తక్కువ సమయంలోనే మ్యాచ్‌ను ముగించింది. డార్విన్ విజయంతో కొత్త బంగ్లాదేశ్ ఆవిర్భవించిందనే అంచనాలకు మక్కే టెస్టు మాత్రం బ్రేక్ వేసింది. రెండు టెస్టుల సిరీస్ 1–1తో సమం కావడంతో ఇరు జట్ల మధ్య పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.

# బంగారం ఎప్పటికీ తుప్పు ఎందుకు పట్టదు?



మానవ చరిత్రలో బంగారానికి ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ధర ఎంత పెరిగినా షాపులన్ని మహిళలతో కిటకిటలాడుతుంటాయి. మన భారతీయ సాంప్రదాయంలో పసిడికి ప్రత్యేక స్థానముంది. మహిళలకు అత్యంతగా ఇష్టపడేది బంగారం. అయితే బంగారం ఎన్నేళు అయినా చెక్కు చెదరకుండా ఉంటుంది. వేల సంవత్సరాల క్రితం భూమిలో దాచిన బంగారు నాణాలు, ఆభరణాలు ఈరోజు తవ్వి తీసినా నిన్న మొన్న చేసిన వాటిలాగే తళతళలాడుతూ ఉంటాయి. ఇనుము లాంటి లోహాలు కొద్దిరోజులు తేమ తగిలితేనే తుప్పు పట్టి పాడైపోతాయి. కానీ బంగారం మాత్రం వేల ఏళ్లయినా అలాగే ఉంటుంది. అసలు బంగారం ఎందుకు తుప్పు పట్టదు? దాని మెరుపు ఎప్పటికీ ఎందుకు తగ్గదు? దీని వెనుక ఉన్న ఆసక్తికరమైన సైన్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం. 1. రసాయనిక నిష్క్రియాత్మకత: రసాయన శాస్త్రం () ప్రకారం, బంగారం ఒక "నోబెల్ మెటల్" (). అంటే ఇది చాలా జడత్వ స్వభావాన్ని కలిగి ఉంటుంది. వేరే ఇతర మూలకాలతో లేదా రసాయనాలతో ఇది అంత త్వరగా ప్రతిచర్య (తీముఖ్) జరపదు. ఆవర్తన పట్టిక () లో బంగారం సంకేతం ). దీని అణు సంఖ్య 79. దీని ఎలక్ట్రాన్ అమరిక చాలా స్థిరంగా ఉంటుంది. అందువల్ల ఇది తన ఎలక్ట్రాన్లను అంత సులభంగా కోల్పోదు.

1. రసాయనిక నిష్క్రియాత్మకత: రసాయన శాస్త్రం () ప్రకారం, బంగారం ఒక "నోబెల్ మెటల్" (). అంటే ఇది చాలా జడత్వ స్వభావాన్ని కలిగి ఉంటుంది. వేరే ఇతర మూలకాలతో లేదా రసాయనాలతో ఇది అంత త్వరగా ప్రతిచర్య (తీముఖ్) జరపదు. ఆవర్తన పట్టిక () లో బంగారం సంకేతం ). దీని అణు సంఖ్య 79. దీని ఎలక్ట్రాన్ అమరిక చాలా స్థిరంగా ఉంటుంది. అందువల్ల ఇది తన ఎలక్ట్రాన్లను అంత సులభంగా కోల్పోదు. 2. ఆక్సిజన్‌తో చర్య జరపకపోవడం: ఇనుము తుప్పు పట్టడానికి ప్రధాన కారణం ఆక్సిడేషన్ (. ఇనుము గాలిలోని ఆక్సిజన్, తేమతో చర్య జరిపి 'ఐరన్ ఆక్సైడ్' (తుప్పు) గా మారుతుంది. కానీ బంగారం విషయానికి వస్తే గాలిలోని ఆక్సిజన్ లేదా నీటి అణువులు దీనిపై ఎలాంటి ప్రభావం చూపలేవు. బంగారం ఆక్సిజన్‌తో అస్సలు ప్రతిచర్య జరపదు. అందుకే దీనికి ఆక్సైడ్ పొర ఏర్పడదు. ఫలితంగా ఇది ఎప్పటికీ తుప్పు పట్టదు. 2. ఆక్సిజన్‌తో చర్య జరపకపోవడం: ఇనుము తుప్పు పట్టడానికి ప్రధాన కారణం ఆక్సిడేషన్ (). ఇనుము గాలిలోని ఆక్సిజన్, తేమతో చర్య జరిపి 'ఐరన్ ఆక్సైడ్' (తుప్పు) గా మారుతుంది. కానీ బంగారం విషయానికి వస్తే గాలిలోని ఆక్సిజన్ లేదా నీటి అణువులు దీనిపై ఎలాంటి ప్రభావం చూపలేవు. బంగారం ఆక్సిజన్‌తో అస్సలు ప్రతిచర్య జరపదు. అందుకే దీనికి ఆక్సైడ్ పొర ఏర్పడదు. ఫలితంగా ఇది ఎప్పటికీ తుప్పు పట్టదు. 3. ఆమ్లాల ) ను సైతం తట్టుకుంటుంది: సాధారణ ఆమ్లాలు () కూడా బంగారాన్ని ఏమీ చేయలేవు. హైడ్రోక్లోరిక్ యాసిడ్ లేదా నైట్రిక్ యాసిడ్ విడివిడిగా బంగారంతో చర్య జరపలేవు. కేవలం నైట్రిక్ యాసిడ్, హైడ్రోక్లోరిక్ యాసిడ్ల మిశ్రమమైన

# బంగారం, వెండి కాదు.. భవిష్యత్తులో దీనిదే హవా.. ఇన్వెస్టర్లకు రాబర్ట్ కియోసాకి బిగ్ అలర్ట్..



ప్రముఖ ఆర్థిక నిపుణుడు, రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత రాబర్ట్ కియోసాకి గ్లోబల్ ఇన్వెస్టర్ల దృష్టిని మరో కీలకమైన లోహం వైపు మళ్లించారు. ఇప్పటివరకు బంగారం, వెండి, బిట్‌కాయిన్‌ల గురించి మాట్లాడిన ఆయన.. ఈసారి రాగి భవిష్యత్తుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో రాగి మార్కెట్ బూమ్ కాబోతుందని, చాకచక్యంగా ఆలోచించే ఇన్వెస్టర్లకు ఇది గోల్డెన్ ఆపర్చునిటీ అని ఆయన అభిప్రాయపడ్డారు. గత ఏడాది కాలంలోనే రాగి ధరలు సుమారు 50 శాతం పెరిగినప్పటికీ, అసలు పెరుగుదల ముందుందే ఉందనేది కియోసాకి విశ్లేషణ.దీనికి ప్రధానంగా 3 రంగాలు కారణమవుతున్నాయిఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ -- డేటా సెంటర్లు: ఆ× టెక్నాలజీ వేగంగా విస్తరిస్తుండటంతో భారీ డేటా సెంటర్ల నిర్మాణం పెరుగుతోంది. వీటిలో విద్యుత్ ప్రసారానికి రాగి అత్యంత కీలకం.ఎలక్ట్రిక్ వాహనాలు: సాధారణ పెట్రోల్, డీజిల్ కార్లతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలలో 3 నుంచి 4 రెట్లు ఎక్కువ రాగిని ఉపయోగిస్తారు.గ్రీన్ ఎనర్జీ -- పవర్ గ్రిడ్లు: సోలార్, విండ్, గ్లోబల్ పవర్ గ్రిడ్ల ఆధునీకరణకు రాగి వినియోగం విపరీతంగా పెరిగింది.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 2.8 కోట్ల టన్నులుగా ఉన్న రాగి డిమాండ్.. 2040 నాటికి 4.2 కోట్ల టన్నులకు చేరుకుంటుందని అంచనా.సరఫరా సంక్షోభం -- కాపర్ సిజర్స్ ప్రభావంఒకవైపు డిమాండ్ విపరీతంగా పెరుగుతుంటే, మరోవైపు ప్రపంచ మార్కెట్‌లో రాగి లభ్యత క్రమంగా తగ్గిపోతుంది. ప్రపంచంలోనే అతిపెద్ద రాగి ఉత్పత్తిదారు అయిన చిలీ దేశంలో గనుల ఉత్పత్తి దాదాపు 9.5శాతం పడిపోయింది. గత రెండు దశాబ్దాలుగా మైనింగ్ గనుల్లో లభించే రాగి ఖనిజ నాణ్యత తగ్గిపోయింది. ఫలితంగా గతంలో లభించినంత రాగిని వెలికితీసేందుకు ఇప్పుడు 20శాతం అదనంగా గనులను తవ్వాల్సి వస్తోంది. డిమాండ్ విపరీతంగా పెరగడం, అదే సమయంలో సరఫరా పడిపోవడాన్ని కియోసాకి కాపర్ సిజర్స్‌గా అభివర్ణించారు. ఈ కత్తెర కత్తిరింపు ధోరణి వల్ల రాగి ధరలు భవిష్యత్తులో మరింత మండే అవకాశం ఉంది.ఇన్వెస్టర్లకు కియోసాకి ఇచ్చిన కీలక సూచనలు..సాంప్రదాయ పొదుపు సరిపోదు: బ్యాంకులు, ఫిక్స్డ్ డిపాజిట్ల వంటి పాతపద్ధతి పొదుపు మార్గాలకే పరిమితమైతే ద్రవ్యోల్బణం, మారుతున్న ఆర్థిక పరిస్థితుల వల్ల నష్టపోతారని ఆయన హెచ్చరించారు.స్మార్ట్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ: "ఏ ఒక్క మైనింగ్ కంపెనీ గెలుస్తుందో ఊహించడం కంటే.. మారుతున్న ఈ గ్లోబల్ ట్రెండ్స్ వల్ల ఎలాంటి పరిస్థితుల్లోనైనా లాభపడే రంగాలు, సంస్థల పై దృష్టి పెట్టడమే ఉత్తమం" అని తన రిచ్ డాడ్





లక్ష్య సాధన కోసం నిరంతర శ్రమతో పట్టువదలకుండా ముందుకు సాగితే గమ్యాన్ని తప్పక చేరుకోవచ్చని ఎఫ్‌డీవో యశ్ చంద్ర ప్రకాష్ నిరూపించారు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఆయన, ఉద్యోగ ప్రయత్నాల్లో ఎన్నోసార్లు ఓటములు ఎదురైనా నిరాశ చెందలేదు. ఆరేళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత అనుకున్న లక్ష్యాన్ని సాధించి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. మూగజీవులు, వన్యప్రాణులపై ఉన్న ప్రేమ యశ్ చంద్ర ప్రకాష్‌ను అటవీశాఖ వైపు నడిపించింది. 2017 నుంచి యూపీఎస్సీకి సిద్ధమైన ఆయన ఎలాంటి కోచింగ్ సెంటర్‌కు వెళ్లలేదు. ఇంట్లోనే ఉంటూ స్వయంగా నోట్స్ రాసుకుని చదివారు. రోజుకు దాదాపు పది గంటల పాటు కఠోర సాధన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అనేకసార్లు ప్రయత్నించినా తొలినాళ్లలో ఫలితం దక్కలేదు. అయినా ఆత్మవిశ్వాసాన్ని ఏమాత్రం కోల్పోకుండా నిలబడ్డారు.

నాన్నే నా రోల్ మోడల్తన విజయంలో తండ్రి ప్రకాష్ పాత్ర ఎంతో కీలకమని యశ్ వెల్లడించారు. పెద్దగా చదువుకోకపోయినా వ్యాపారంలో విజయం సాధించిన తండ్రి జీవితమే తనకు ప్రధాన ఆదర్శమని చెప్పారు. అలాగే ఎంఎస్ ధోనీ సినిమా తనలో అమితమైన స్ఫూర్తిని నింపిందని గుర్తుచేసుకున్నారు. రాజస్థాన్‌లోని బర్మేర్ జిల్లాకు చెందిన వీరి కుటుంబం పాతికేళ్ల కిందట గుజరాత్‌లోని కచ్ ప్రాంతానికి వలస వెళ్లింది. యశ్ విద్యాభ్యాసమంతా అక్కడే సాగింది. 2017లో ఇందిరాగాంధీ జాతీయ విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ పూర్తి చేశారు. యూపీఎస్సీకి సిద్ధమవుతున్న సమయంలో స్నేహితుడి ఇచ్చిన సలహా ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. 2023లో హర్యానా గ్రూప్–1 పరీక్ష రాసి బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఉద్యోగం చేస్తూనే మరింత పట్టుదలతో చదివి 2024 యూపీఎస్సీ ఫలితాల్లో ఐఎఫ్ఎస్ విభాగంలో జాతీయ స్థాయిలో 37వ ర్యాంకు సాధించారు. ముస్సోరీ, గుర్తుచేసుకున్నారు. రాజస్థాన్‌లోని బర్మేర్ జిల్లాకు చెందిన వీరి కుటుంబం పాతికేళ్ల వెళ్లింది. యశ్ విద్యాభ్యాసమంతా అక్కడే సాగింది. 2017లో ఇందిరాగాంధీ జాతీయ డెహ్రాడూన్‌లలో శిక్షణ పూర్తయ్యాక, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భూపాలపల్లిలో రేంజ్ ఆఫీసర్‌గా పనిచేసి ప్రస్తుతం అమ్రాబాద్ ఎఫ్‌డీవోగా బాధ్యతలు స్వీకరించారు.

# బుడ్డోడి దూకుడు వెనుక సీక్రెట్ ఏంటి?

జింబాబ్వే పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టు తొలి టీ20 పోరులోనే తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. వరుసగా మ్యాచ్‌లు జరుగుతున్న ఈ సుదీర్ఘ సిరీస్‌లో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది మాత్రం భారత్ వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ. మైదానంలోకి దిగిన నిమిషం నుంచే జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడిన వైభవ్, సిక్సర్లు, ఫోర్ల వర్షం కురిపిస్తూ మైదానాన్ని హోరెత్తించాడు.18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ!హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో వైభవ్ ఆడిన ఇన్నింగ్స్ క్రికెట్ అభిమానులను మంత్రముగ్ధులను చేసింది.కేవలం 19 బంతుల్లో 50 పరుగులు: వైభవ్ కేవలం 18 బంతుల్లోనే తన అర్ధసెంచరీ పూర్తి చేసి, మొత్తం 19 బంతుల్లో 4 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో 50 పరుగులు సాధించాడు.స్ట్రైక్ రేట్ సంచలనం: 263కు పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసి ప్రత్యర్థి బౌలర్లకు కోలుకోలేని షాక్ ఇచ్చాడు.!తిరగరాసిన రికార్డుల చిట్టా..అతిపిన్న వయస్కుడిగా రికార్డు: అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అతి చిన్న వయస్సులోనే అర్ధసెంచరీ సాధించిన ఆటగాడిగా వైభవ్ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు.వేగవంతమైన ఫిఫ్టీ: టీ20ల్లో భారత్ తరఫున అత్యంత వేగంగా 50 పరుగులు సాధించిన కొద్దిమంది దిగ్గజ ఆటగాళ్ల సరసన ఈ యువ సంచలనం చోటు దక్కించుకున్నాడు.హరారే గ్రౌండ్‌లో రికార్డు నమోదు: హరారే వేదికగా టీ20 ఇన్నింగ్స్‌లో అత్యుత్తమ స్ట్రైక్ రేట్‌తో పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా కొత్త మైలురాయిని చేరుకున్నాడు. భారత్ ఆధిపత్యం, సిరీస్ సమీకరణాలు..



గత కొన్ని టీ20 మ్యాచ్‌ల్లో హెచ్చుతగ్గులు ఎదుర్కొన్న టీమ్ ఇండియా, ఈ సిరీస్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో బరిలోకి దిగిన భారత యువ జట్టు, వైభవ్ ఇచ్చిన మెరుపు ఆరంభంతో మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది. జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా సేన భారత బ్యాటర్ల ధాటికి చేతులెత్తేసింది. బ్యాక్–టు–బ్యాక్ మ్యాచ్‌లతో కొనసాగుతున్న ఈ సిరీస్‌లో భారత్ తమ విజయ పరంపరను ఇలాగే కొనసాగించాలని పట్టుదలగా ఉంది.

# ఆల్‌టైమ్ రికార్డ్ ధరతో పోలిస్తే వెండి రూ.2 లక్షలు తక్కువ! ఇప్పుడు కొంటే..

భారత బులియన్ మార్కెట్‌లో గత కొద్ది నెలలుగా వెండి ధరలు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. ఒకప్పుడు వరుస రికార్డులు సృష్టించిన వెండి ధరలు ఇప్పుడు భారీగా క్షీణించాయి. ఈ ఏడాది జనవరిలో వీజశలో వెండి ఫ్యూచర్స్ కిలోకు సుమారు రూ.4.39 లక్షల నుంచి రూ.4.57 లక్షల వరకు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిని తాకగా, ప్రస్తుతం ధరలు రూ.2.38 లక్షల నుంచి రూ.2.41 లక్షల పరిధికి పడిపోయాయి. అంటే గరిష్ఠ స్థాయి నుంచి దాదాపు రూ.2 లక్షల నుంచి రూ.2.16 లక్షల వరకు విలువ కోల్పోయింది.కారణాలేంటి?ఈ భారీ పతనానికి అనేక అంతర్జాతీయ కారణాలు ఉన్నాయి. అమెరికా డాలర్ బలపడటం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు ఎక్కువకాలం అధిక స్థాయిలో ఉండే అవకాశం, పెట్టుబడిదారుల భారీ ప్రాఫిట్ బుకింగ్, అంతర్జాతీయ మార్కెట్లలో రిస్క్–ఆఫ్



సెంటిమెంట్ వెండి ధరలను కిందకు లాగాయి. గతంలో వేగంగా పెరిగిన ధరల్లో ఊహాజనిత కొనుగోళ్లు కూడా ఈ పతనానికి కారణమయ్యాయని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే దీర్ఘకాలిక దృశ్యం మాత్రం పూర్తిగా ప్రతికూలంగా లేదని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. వెండి కేవలం విలువైన లోహమే కాదు, పారిశ్రామిక అవసరాలకు కూడా కీలకమైన ముడిసరుకు. సోలార్ ప్యానెల్లు, ఎలక్ట్రిక్ వాహనాలు (జుఎలు), బ్యాటరీలు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీలో వెండి వినియోగం ప్రతి ఏడాది పెరుగుతోంది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా గనుల ఉత్పత్తి అంత వేగంగా పెరగకపోవడంతో డిమాండ్–సరఫరా అంతరం భవిష్యత్తులో ధరలకు మద్దతు ఇవ్వొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.కియోసాకి ఏం చెబుతున్నారంటే..?

రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తక రచయిత, పెట్టుబడి నిపుణుడు రాబర్ట్ కియోసాకి కూడా వెండిపై ఇప్పటికీ ఆశావహంగానే ఉన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెద్ద సంక్షోభం వచ్చే అవకాశాలను ప్రస్తావిస్తూ, సంప్రదాయ కరెన్సీల కంటే బంగారం, వెండి, బిట్‌కాయిన్

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644






## నార్త్.. సౌత్.. అనే గొడవ వద్దు.. రాకింగ్ స్టార్ యశ్ స్పీచ్..

హీరో యశ్ తన తాజా చిత్రం టాక్సిక్ ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ప్రసంగిస్తూ, దేశంలోని నార్త్-సౌత్ విభజనపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో యువతకు స్ఫూర్తినిచ్చే సందేశాన్ని అందించారు. "ఇండియన్ సిస్టంలో చాలా రాష్ట్రాలు ఉన్నాయి. అందరికీ తమ భాష అంటే చాలా ప్రేమ. అయితే, ప్రస్తుతం అందరూ కలిసి రావాల్సిన సమయం ఆసన్నమైంది" అని యశ్ స్పష్టం చేశారు. ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని చూసే వారిని, లేదా ఈ అంశంపై రాజకీయాలు చేయాలనుకునే వారిని ఎవరూ పట్టించుకోవద్దని ఆయన ప్రేక్షకులను, ముఖ్యంగా యువతను కోరారు"మీరు కష్టపడితే, మన దేశంలో ఏ రాష్ట్రానికి వెళ్లినా, ఎక్కడికి వెళ్లినా అదే ప్రేమ దొరుకుతుంది. మన దేశంలో ఎక్కడ నుంచి ఎవరైనా వచ్చి మంచి పని చేసినా, అంతే ప్రేమ మీరు ఇస్తారు. ఆ నమ్మకం నాకు ఉంది" అని యశ్ తన ప్రసంగంలో నొక్కి చెప్పారు. ఈ మాటలు ప్రాంతీయ భేదాలను పక్కన పెట్టి మానవత్వాన్ని, కృషిని గౌరవించాలని సూచిస్తాయి. తన సందేశానికి మరింత బలం చేకూర్చేందుకు, యశ్ ఒక చిన్న స్ఫూర్తిదాయక కథను పంచుకున్నారు. మొట్టమొదట స్టీమ్‌బోట్ ఇంజిన్‌ను ఆవిష్కరించినప్పుడు జరిగిన సంఘటనను ఆయన వివరించారు. "ఫస్ట్ టైం ఎవరో ఒక స్టీమ్‌బోట్ ఇంజిన్ ఇన్వెంట్ చేసినప్పుడు, దే వాంటెడ్ టు షో ఇట్ టు ది హోల్ వరల్డ్ అంట. అప్పుడు అక్కడ ఉన్న సిటీలో ఎవ్రీబడీ వెంట్ టు విట్నెస్ ఇట్. కానీ విట్నెస్ చేసే వెళ్లే మనిషి అందరూ ఏం చెప్పారంట, అరే ఇది ఎలా జరుగుతుంది రా. ఇది ఎలా జరగొచ్చు. ఏదో స్టీమ్ అంట. ఆ స్టీమ్ తో బోట్ ముందు పోతుంది అని. థిస్ విల్ నెవర్ హ్యాపెన్ అని మాట్లాడుతూ, దే వర్ స్పీకింగ్ అబౌట్ ఇట్" అని యశ్ వివరించారు.ప్రజలు స్టీమ్‌బోట్‌ను అనుమానించినా, అది మొదలైందని, ముందుకు కదిలిందని ఆయన గుర్తు చేశారు. "స్టార్ట్ అవ్వలేదురా, స్టార్ట్ అయ్యే ఛాన్సే లేదు అన్నవారు, అది స్టార్ట్ అయ్యాక నోరు మూయలేదు. మూవ్ అవ్వదు అన్నవారు, అది కదిలాక కూడా తమ మాట మార్చుకోలేదు. అది ఆగిపోదు, ఎక్కడో క్రాష్ అవుతుంది, మునిగిపోతుంది అన్నారు" అని యశ్ చెప్పగా, ప్రేక్షకులు ఆలోచనలో పడ్డారు. "సో, వాట్ ఐ యామ్ ట్రైయింగ్ టు టెల్ ఈజ్, లైఫ్‌లో, ఇన్ లైఫ్ మీరేం చేసేకి వెళ్లినా, ఇలాగే మాట్లాడేవాడు మాట్లాడుతూనే ఉంటారు. డోంట్ లిజన్ టు ఎనీబడీ. కీప్ గోయింగ్. సక్సెస్ విల్ బీ యువర్స్. విత్ మై ఎక్స్పీరియన్స్, ఐ హావ్ రియలైజ్డ్ దట్. సో, ఐ వుడ్ లవ్ టు షేర్ దట్ విత్ యు" అని యశ్ తన వ్యక్తిగత అనుభవాన్ని జోడించి యువతకు సందేశమిచ్చారు. జీవితంలో ఎలాంటి ప్రతికూల వ్యాఖ్యలను పట్టించుకోకుండా, తమ లక్ష్యం వైపు దృఢంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ సందేశం సినీ రంగంలో, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేందుకు స్ఫూర్తినిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఈ ఈవెంట్ హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీలో జరిగింది.

## జిమ్ చేయను.. కానీ రోజూ ఆ ఒక్క పని మాత్రం చేస్తా

తెలుగు చిత్ర పరిశ్రమలో న్యాచురల్ స్టార్ గా పేరు సంపాదించుకున్నారు హీరో నాని. వరుస హిట్లతో ఫుల్ జోష్ మీదున్నారు. ప్రస్తుతం ది ప్యారడైజ్ చిత్రంలో నటిస్తున్నారు. కొన్నినెలలుగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను త్వరలోనే రిలీజ్ చేయనున్నారు. ఇదిలా ఉంటే.. నాని జిమ్ అసలు జిమ్ చేయరు. ఎప్పుడూ తన జిమ్ వీడియోస్, ఫిట్నెస్ వీడియోస్ సైతం షేర్ చేయరు. గతంలో ఓ ఇంటర్వ్యూలో నాని తన ఈ లుక్ వెనుక ఉన్న రహస్యాలను, తన వ్యక్తిగత ఫిట్‌నెస్ మంత్రాలను వెల్లడించారు. తాను జిమ్‌కు వెళ్లకపోయినా, ఎప్పుడూ ఫిట్‌గా, ఆరోగ్యంగా ఎలా ఉండగలరో ఆయన వివరించారు. కొత్త సినిమా హాయ్ నాన్నలో యవ్వనంగా కనిపించడం గురించి అడిగినప్పుడు, నాని దీనికి అనేక కారణాలు ఉన్నాయని తెలిపారు. "కొద్దిగా బరువు తగ్గాను. దసరా తర్వాత గడ్డం తీసి, హెయిర్ స్టైల్ మార్చడం వల్ల లుక్ మారింది. కొంచెం హెయిర్ గ్రూమ్డ్ గా ఉంది. చిన్న స్టబుల్ (గడ్డం) ఉండటం వల్ల కూడా నీట్‌గా కనిపిస్తుంది. అలాగే, నా కాస్ట్యూమ్స్, ముంబైకి చెందిన ఓ ఆపరేటెడ్ కంపెనీ డిజైన్ చేయడం వల్ల ఒక క్లాస్ ఉంది. అన్నిటికంటే ముఖ్యంగా, సినిమాటోగ్రాఫర్ సాను జాన్ వర్గీస్ ఒక మెజీషియన్ లాంటివారు. ఆయన బ్రిలియంట్ సినిమాటోగ్రఫీ వల్ల నాకు ఒక మంచి లుక్ వచ్చింది. ఇవన్నీ కలిపి నాకు ఈ యంగ్ లుక్ రావడానికి దోహదపడ్డాయి" అని నాని స్పష్టం చేశారు.శారీరక శ్రమ, ఆహారపు అలవాట్లపై తన అభిప్రాయాలను వెల్లడిస్తూ, తాను జిమ్‌లో అధిక వ్యాయామాలు, స్ట్రెంత్ ట్రైనింగ్ లేదా వెయిట్ లిఫ్టింగ్ చేయనని నాని తెలిపారు. "నేను కేవలం కార్డియో మాత్రమే చేస్తాను. నేను ఎప్పుడూ స్థిరమైన బరువును కలిగి ఉంటాను. దీనికి ప్రధాన కారణం నేను నిరంతరం పని చేయడమే" అని నాని అన్నారు. "పని చేయడమే అత్యంత ముఖ్యమైన విషయం. మనం ఇంట్లోనే కూర్చుంటే సహజంగానే బరువు పెరుగుతాం. పనిలో నిమగ్నమైతే మనం ఫిట్‌గా ఉండగలం" అని ఆయన వివరించారు.ఆహారపు అలవాట్ల విషయానికి వస్తే, నాని చాలా విలక్షణమైన పద్ధతిని అనుసరిస్తారు. "నేను ప్రతిదీ, ఏదైనా తింటాను" అని ఆయన చెప్పారు. ఆహార నిపుణుడిగా తాను చెప్పలేనప్పటికీ, తన పరిశీలన ప్రకారం, బరువు తగ్గడానికి డైట్లు పాటించేవారు, కొన్ని ఆహారాలు మానేసినవారు దీర్ఘకాలంలో తిరిగి బరువు పెరుగుతారని ఆయన అభిప్రాయపడ్డారు. "శరీరాన్ని టార్చర్ చేయకూడదు. మానేసి సలాడ్‌లకు మారితే శరీరం దానికి సిద్ధంగా ఉండదని, ఒత్తిడికి గురవుతుందని నాని హెచ్చరించారు. "ఇది నా అవగాహన" అని చెబుతూ, ఇప్పుడు మళ్లీ అందరూ తమ మూలాలకు తిరిగి వస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు డైట్ల పేరుతో అనేక పద్ధతులు ప్రచారంలో ఉన్నాయని, కానీ అవి దీర్ఘకాలంలో ఆరోగ్యానికి మంచివి కావని అన్నారు. "మీరు ఏదైనా తినండి, కానీ నియంత్రణ, క్రమశిక్షణ కలిగి ఉండండి. అదే జీవితంలో ముఖ్యమైనది" అని నాని తన ఫిట్‌నెస్ గురించి చెప్పుకొచ్చారు.





## నన్ను పెళ్లి చేసుకోవాలంటే ఒక్క మెసేజ్ చేయండి.

.హీరోయిన్ రేఖ వేదవ్యాస్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఆనందం సినిమాతో తెలుగులో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. అప్పట్లో తెలుగులో ఆమె క్రేజీ హీరోయిన్. అయితే చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న ఆమె.. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, ప్రేమ, వివాహ బంధాలపై ఆసక్తికర విషయాలు పంచుకుంది. తాను ఇప్పటికీ సింగిల్‌గానే ఉన్నానని, బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌లాగే తాను కూడా సింగిల్‌గా మిగిలిపోతానేమోనని రేఖ సరదాగా అన్నారు. తన సింగిల్ స్టేటస్‌ను ఎవరూ నమ్మడం లేదని, ఎందుకంటే ఎవరో ఒకరు ఉంటారులే అని అందరూ అనుకుంటారని చెప్పుకొచ్చారు. తనకు కాబోయే జీవిత భాగస్వామి ఎలా ఉండాలనే ప్రశ్నకు రేఖ ఆసక్తికర సమాధానమిచ్చారు. పెద్ద ప్లానింగ్ ఏమీ లేదు. వంద పాయింట్ల లిస్టు అనేది యవ్వనంలో ఉండేది. ఇప్పుడు అంతా లేదు, అని ఆమె చెప్పారు. పర్‌ఫెక్ట్ హ్యూమన్ బీయింగ్ ఎవరూ కాదని, తానూ కాదని అన్నారు. కేవలం మంచి మనసున్న వ్యక్తి అయి, తనను ప్రేమించేవాడైతే చాలని రేఖ స్పష్టం చేశారు. భాగస్వామి ఎత్తు, రంగు వంటివి ముఖ్యం కాదని, హృదయం గొప్పదని, అదే శాశ్వతమని అన్నారు.మెసేజ్ చేయవచ్చని రేఖ ఆహ్వానించారు. అయితే, టైం పాస్ కోసం కాకుండా, సీరియస్‌గా పెళ్లి చేసుకోవాలనుకునేవారు మాత్రమే మెసేజ్ చేయాలని ఆమె షరతు విధించారు. లవ్, క్రష్, ఇన్ఫాట్యుయేషన్, ఆబ్సెషన్ మధ్య వ్యత్యాసాన్ని వివరిస్తూ, క్రష్ అంటే ఒక హీరోపై లేదా కాలేజీలో ఒకరిపై ఇష్టం

## ఆ ఒక్క హీరోతో 12 సినిమాలు చేస్తే పది హిట్ అయ్యాయి.



దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు సినిమాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వెంకయ్యనాయుడు వంటి ప్రముఖులు కూడా ఆయన సినిమాలు "స్వర్గాన్ని నేలమీదకు దించినట్టు" ఉంటాయని ప్రశంసించారు. ఒక హీరోయిన్‌ను ఇంత అందంగా మరే దర్శకుడు చూపించలేదని, హీరోయిన్ ఎంట్రీ షాట్‌లు పూల మధ్యలో చూపించడం తన ప్రత్యేకత అని వ్యాఖ్యాత అన్నారు. తన కెరీర్ తొలినాళ్లలో "జ్యోతి", "ఆమె కథ", "అమరదీపం" వంటి లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతో విజయం సాధించారు రాఘవేంద్రరావు. ఈ చిత్రాల తర్వాత ఇలాంటి అవకాశాలు చాలా వచ్చినా, కేవలం అలాంటి చిత్రాలకే పరిమితం కాకుండా సరైన సమయం కోసం వేచి చూశానని, అది "అడవిరాముడు" చిత్రానికి దారితీసిందని ఆయన వివరించారు.ఎన్టీఆర్ కథానాయకుడిగా రూపొందించిన "అడవిరాముడు" కేవలం 38 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేసుకుని, అప్పట్లో నాలుగు కోట్ల రూపాయల వసూళ్లతో, నేటి ఐదు వేల కోట్ల రూపాయలకు సమానమైన విజయాన్ని సాధించిందని తెలిపారు. ఈ చిత్రం కోసం ఎన్టీఆర్‌ను ఏనుగుపై చూపించే ఆలోచన, కథను అడవి నేపథ్యానికి మలచడం వంటి ఎన్నో



## అబ్బబ్బా.. క్రేజీ జోడి భయ్యా.. ప్రభాస్ సరసన ఆ స్టార్ హీరోయిన్..?

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక యాక్షన్ డ్రామా 'స్పిరిట్' (రాజూఅతీఞ). కాంబినేషన్ ప్రకటన నుంచే ఈ సినిమాపై సినీ ప్రియుల్లోనూ, అభిమానుల్లోనూ అపారమైన అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. ఈ భారీ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ ఒక పవర్ ఫుల్ పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు.

ఇప్పటికే ఈ చిత్రంలో కథానాయికగా 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రి నటిస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది. అయితే కత్రినా కైఫ్‌ను సెకండ్ హీరోయిన్‌గా కాకుండా, కథలో అత్యంత ప్రాధాన్యత ఉన్న, కథను మలుపు తిప్పే ఒక విశిష్టమైన పాత్ర కోసం సంప్రదించినట్లు టాక్. ఒకవేళ ఇది నిజమైతే, వెండితెరపై ప్రభాస్ – కత్రినా కాంబినేషన్ అభిమానులకు అసలైన విజువల్ ఫీస్ట్‌గా మారనుంది. కత్రినా కైఫ్‌కు తెలుగు పరిశ్రమతో పాత అనుబంధమే ఉంది. గతంలో ఆమె విక్టరీ వెంకటేష్ సరసన 'మల్లీశ్వరి', నందమూరి బాలకృష్ణ సరసన 'అల్లరి పిడుగు' చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులను అలరించారు.

ఇప్పటికే ఈ చిత్రంలో కథానాయికగా 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రి నటిస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది. అయితే కత్రినా కైఫ్‌ను సెకండ్ హీరోయిన్‌గా కాకుండా, కథలో అత్యంత ప్రాధాన్యత ఉన్న, కథను మలుపు తిప్పే ఒక విశిష్టమైన పాత్ర కోసం సంప్రదించినట్లు టాక్. ఒకవేళ ఇది నిజమైతే, వెండితెరపై ప్రభాస్ – కత్రినా కాంబినేషన్ అభిమానులకు అసలైన విజువల్ ఫీస్ట్‌గా మారనుంది. కత్రినా కైఫ్‌కు తెలుగు పరిశ్రమతో పాత అనుబంధమే ఉంది. గతంలో ఆమె విక్టరీ వెంకటేష్ సరసన 'మల్లీశ్వరి', నందమూరి బాలకృష్ణ సరసన 'అల్లరి పిడుగు' చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులను అలరించారు.ఆ తర్వాత పూర్తిగా బాలీవుడ్‌కే పరిమితమైన కత్రినా, చాలా కాలం తర్వాత మళ్లీ ఒక భారీ సౌత్ ఇండియన్ ప్రాజెక్ట్‌లో భాగం కాబోతుండటం విశేషం. ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ, 'స్పిరిట్' షూటింగ్ దాదాపు 40 శాతం పూర్తయిందని వెల్లడించారు. ఇందులో ప్రభాస్ ఐపీఎస్ (ఞూూ) ఆఫీసర్‌గా, మునుపెన్నడూ చూడని అత్యంత పవర్ ఫుల్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నారు. టి-సిరీస్ , భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా అత్యున్నత